నీలాసుందరీపరిణయము



కూచిమంచి తిమ్మన

శ్రీరస్తు

నీలాసుందరీ పరిణయము

కూచిమంచి తిమ్మకవి ప్రణీతము

చెన్నపురి:
వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే
బ్రకటితము.
1939

All Rights Reserved.

శ్రీరస్తు

నీలాసుందరీ పరిణయము

పీఠిక

ఇష్టదేవతాది ప్రార్థనము

లకుఁ దానకం బగుచుఁ జెన్నలరారెడు వెండికొండపై
మేలికడానిడాల్ హొయలు మీఱెడుజాబిలిఱాలమేడలో
వేలుపుఱేఁడు వల్వయును వెన్నుఁడు గొల్వఁగ మంచుఁగొండరా
చూలిని గూడి వేడుకలఁ జొక్కెడులేనెలతాల్పుఁ గొల్చెదన్. ॥1॥

సీ. అలరుపెంగడిమితోఁటల నాడుపూఁబోడి
పూపవెన్నెలఁతేనిఁ బూనుచాన
కోరి యేనుఁగుమోముఁగొడుకుఁ గాంచినతల్లి
చిలువతాలుపువేల్పువలపుటింతి
తెలిబొబ్బమెకపుమేల్తేజి నెక్కెడిదంట
చెడుగురక్కసిమూఁకఁ జిదుముదిట్ట
తొలుపల్కుగిల్కుటందెలుగలయెలనాఁగ
యెల్ల మేల్టెంకియై యెసఁగుచామ
తే. యొనరఁ దెఱగంటితెఱవలయుడిగములకు
నడరి యుడివోనిబలుసిరులిడెడునట్టి
గట్టుదొరపట్టి యెనలేనికనికరమునఁ
బొదలుచును మమ్ము ననయంబుఁ బ్రోచుఁగాత. ॥2॥

సీ. కొఱమాలి విసమిడ్డకఱకురక్కసిఁ జెండి
పఱపుమీఱెడుబండి విఱుగఁ ద్రొక్కి
వెఱఁగొప్పఁ బ్రేతల మొఱఁగి వెన్నలు మెక్కి
తఱి నూచి మద్దులు పెఱికివైచి
యఱచేతఁ గొండఁ జూపఱు వొగడఁగఁ బూని
నెరి గిబ్బతొలువేల్పు మురియడంచి
చిఱుతపాయపుగొల్లతెఱవల వలపించి
మఱవ పసులఁ బల్మఱును గాచి
తే. వెఱవెఱుంగక మడువున నుఱికి కడిమి
మెఱయఁ డక్కరివిసదారి బిఱుసుఁదఱిమి
మఱియుఁ బే రగుతులువల నుఱుముసేసి
వఱలుకఱివేల్పు నెదనెంతు గుఱిదలిర్ప. ॥3॥

ఉ. కమ్మనితెమ్మదెమ్మెరలు గ్రమ్మఁగ ని మ్మగుతమ్మిమేడలోఁ
దుమ్మెదకొమ్మ లెమ్మెలను దూకొని నీటుగఁ బాటఁ బాడఁగాఁ
గొమ్మని పూవుఁదేనియలఁ గూరిమి నామెత లిచ్చి నిచ్చలున్
నెమ్మది నుండుపాల్కడలినెయ్యపుఁగూఁతురు మమ్ముఁ బ్రోచుతన్. ॥4॥

క. తద్దయుఁ బొగడెద వేలుపుఁ
బెద్ద యనన్ జగము లెల్లఁ బెంచుచుఁ బల్కున్
ముద్దియతో నెఱతామర
గద్దియఁ గొలువుండునల్మొగంబులప్రోడన్. ॥5॥

చ. బలు తెలి పుల్గు వారువము, బంగరువీణియ, మిన్కుటందెలున్,
చిలుక తుటారిబోటియును, జిందపువన్నియ మేనుఁ, బొత్తమున్,
చెలువపు తెల్లతమ్మివిరి సింగపుగద్దెయుఁ గల్గి యొప్పు న
ప్పలుకులచాన, జానలరు పల్కులొసంగెడుఁ గాత నిచ్చలున్. ॥6॥

ఉ. మ్రొక్కు లొనర్తుఁ గేలుగవ మోడిచి చొక్కపుఁగొక్కుజక్కిపై
నెక్కెడుబల్వజీరునకు నిమ్ముగ నమ్మినవారిమేల్పనుల్
చక్కఁగఁ జేయుదేవరకుఁ జక్కెర కొబ్బెరపండు లుండ్రముల్
మెక్కెడుపాఁపజందెములమేటికి బత్తిని మాటిమాటికిన్. ॥7॥

ఆ. పుట్టఁ బుట్టినట్టిదిట్టయు దీవిని
బొడమినట్టిపున్నెములగనియును
మొదలుగాఁగఁ గబ్బములు వేల్పుబాసను
గూర్చినట్టివారిఁ గోరి తలఁతు. ॥8॥

ఉ. మున్ను దెనుంగుఁగబ్బములు ముజ్జగముల్ వొగడంగఁ గూర్చి పే
రెన్నికఁ గన్నబల్లిదుల ని మ్మగుడెందపుఁదమ్మిలోపలం
బన్నుగ నిల్పి నిచ్చలును బాయక కూరిమితోఁ దలంచెదన్
నన్నయభట్టుఁ దిక్కనను నాచనసోముని నెఱ్ఱప్రెగ్గడన్. ॥9॥

క. ఎదఁ గుదు రగుబత్తిని గొ
ల్చెదఁ బలుపుట్టువులఁ గూరిచినదోసంబుల్
చిదుమంగా వేడుకపె
ల్లిద మొదవెడుదెందులూరిలింగటగురునిన్. ॥10॥

ఆ. అనుచు నెల్లవేల్పులను గొల్చి మును కబ్బ
ములను గన్నగాళకులను దలఁచి
గురుని బత్తి నెంచి కోరి యచ్చతెనుంగుఁ
గబ్బమే నొనర్పఁ గడఁగుతఱిని. ॥11॥

కవిస్వప్నవృత్తాంతము

సీ. ఏవేల్పు గుదెతాల్పుతీవంచమోముల
తులువల బలుక్రొవ్వు దొలఁగ మీటె
నేసామి సామేన నేప్రొద్దు వలిగట్టు
దొరపట్టి నర్మిలితోడఁ బూనె
నేఱేఁడు పనిమీఱ నీరేడుజగములఁ
బ్రోడయై యనయంబుఁ బ్రోవ నోపె
నేరాయఁ డెనలేనిగారాపుటూడెంపు
జడదారులకు ముత్తి వడి నొసంగె
తే. మన్ను గేస్తుఁడు నగ్గియు మిన్ను నీరుఁ
బ్రొద్దు నెల గాడ్పు లెవ్వానిరూపులయ్యె

నట్టి తెలిగట్టుమన్కిప ట్టినదిట్ట
యొరపు రాణింపఁ గలలోన నొక్కనాఁడు. ॥12॥

సీ. పసిదిండిమెకపురక్కసితోలు మొలఁ జుట్టి
కేల మ మ్మోనవాలు గీలుకొలిపి
చిన్న వెన్నెలతేని సికపువ్వుగాఁ బూని
పెనుచంక నొకజింకపిల్ల నిఱికి
జడలలోఁ దెలినీటిచదలేటిజాల్మాఁటి
జానొంద వెలిబూది మేన నలఁది
తోరంపుఁజిల్వరాతొడవు లిమ్ముగఁ దాల్చి
యెదఁ బున్కసరములు కుదురుపఱచి
తే. మోముఁదమ్మిని జిఱునవ్వు మొలకలెత్త
గుబ్బలులతేనిగారాపుఁగూఁతుతోడ
నుక్కుమిగిలినబలుగిబ్బజక్కి నెక్కి
కొమరుదళుకొత్త మ్రోలఁ గన్గొనఁగనయ్యె. ॥13॥

క. అటువలెఁ గనఁబడి యెద మి
క్కుట మగునక్కటిక మొదక గుబ్బలిదొరయి
ల్లటపల్లుఁడు ననుఁ గన్గొని
దిటముగ నపు డిట్టు లనుచుఁ దెలియం బలికెన్. ॥14॥

సీ. నీతండ్రి గంగన నిచ్చనిచ్చలు మమ్ముఁ
బూజించె నపరంజిపూలచేత
నీతల్లి లచ్చమ న సంతసిలఁగ నో
ములు నోఁచెఁ బుడమివేల్పులకు నెల్ల
నీపినతండ్రు లెన్నికలు గాంచిరి జగ్గ
నయు సింగనయు నర్సనయును మిగిలి
నీతమ్ము లెలమి నొందించిరి మమ్ము సిం
గనయు సూరనయు జగ్గనయుఁ జెలఁగి
తే. నీయనుఁగురాణి బుచ్చమ నెలఁతలెల్ల
మేలనఁ దనర్చె గట్టురాచూలిఁ గొలిచి
మానిగకంబవు గద కూచిమంచికొలము
నం దరయఁ దిమ్మకవిరాయ యలర నీవు. ॥15॥

మ. మును కబ్బంబుల నెల్లఁ జెప్పి యెలమిం బొల్పొందుచున్ నాకు న
ప్పనముల్ చేసినప్రోడ వీవిపుడు గూర్పం బూను నీయచ్చపుం
దెనుఁగుంగబ్బము నిమ్ము నిచ్చలబత్తిస్ఫూర్తియున్ బుత్తియున్
నెన రొప్ప న్నమకూర్చు చెప్పుడును నే నీయొద్దనే యుండెదన్. ॥16॥

క. అని నుడువుచు నద్దేవర
కనుమొఱఁగిన నపుడు మేలుకాంచి యెదను బా
యనివేడ్క లొదవ నతనికిఁ
బని యొనరఁగ మ్రొక్కు లొసఁగి బత్తి దలిర్పన్. ॥17॥

షష్ఠ్యంతములు

క. లిబ్బులదొరచెలికానికి
గుబ్బలియెకిమీనియనుఁగుఁగూఁతుమగనికిన్
బెబ్బులిరేఁద్రిమ్మరితో
ల్బొబ్బినతమిఁ గప్పుకొన్న బలువేల్పునకున్. ‖18‖

క. చుఱుకు గలయొక్కకోలను
గుఱిగాఁ దిగప్రోళ్ళు నేలఁ గూలిచి కడిమిన్
మెఱయుచు జేజేగములకుఁ
దఱుఁగనిమే లిడినగిబ్బతత్తడిదొరకున్. ‖19‖

క. తలఁచునిరాబారులచి
క్కులు దొలఁగఁగఁజేసి మనుచు గొనములగనికిం
దులువతొలువేల్పుఁగూటువ
బలితపుఁబెన్మొగలుఁజాలుఁబయ్యరకుఁ దగన్. ‖20‖

క. నెలఱాలఁ బోలునిద్దపుఁ
దెలిడాల్గలమేనిమేటిదేవర కెపుడుం
గొలిచినబంటులకోర్కులు
పొలుపొదవఁగఁ బిదుకు వేలుపున్మొదవునకున్. ‖21‖

క. పితరదొర కేటత్రాటన్
జతనంబునఁ దివియ మిగుల జడుపున నెదలో
వెత కుడుచుతపసిబిడ్డని
బ్రతికించి యసంబుగన్న బల్లిదున కొగిన్. ‖22‖

తే. అప్పనంబుగ నెలమితో నచ్చతెనుఁగు
బాసచే నిప్పు డేనొనర్పఁగఁ దొడఁగిన
నీల యనుపేరఁ దేజున నివ్వటిల్లు
నింతిపెండిలికతతెఱఁ గెట్టు లనిన. ‖23‖

ప్రథమాశ్వాసము

కథాప్రస్తావన

క. మును నైమిశ మనునడవిని
మొనసి నిరాబారిసింగములు పెక్కుకతల్
వినుచుండి రోమహర్షణు
ననుఁగుంగొడుకునకు నిట్టు లనిరింపొదవన్. ||24||

క. జడదారిరాయ మాకుం
గడునెలమిగ లచ్చిమగనికత యొక్కటి యే
ర్పడఁ దెల్పు మనుచు వేఁడినఁ
దొరి యతం డపుడు వారితో నిట్లనియెన్. ||25||

మిథిలవర్ణనము

తే. వినుఁడు బల్లిదులార మీవీను లలర
నిచ్చలంబుగఁ దెల్పెద దచ్చికడల
నెన్నఁదగి వన్నియలకెల్లనిక్క యగుచుఁ
బుడమిలోపల మిథిలనాఁ బ్రోలు వెలయు. ||26||

సీ. వెలలేనివలుఁదక్రొన్నెలజాలమాడువు
 ల్దట్టంపుఁదరఁగ మొత్తములు గాఁగ
రంగుబంగరువు మెఱుంగుటరంగులు
 నిద్దంపుటిసుకతిన్నియలు గాఁగఁ
గులుకుఁబాయపురాచతలిరాకుఁబోఁడులు
 పగడంబుఁదీవజొంపములు గాఁగ
మేటిపల్గొమ్ముల మెకపురాతుటుములు
 లలితంపుఁబఱపుగుబ్బలులు గాఁగ
తే. వన్నియలుమీఱి చెలువారువారువములు
కొమరుదళుకొత్తు బలుమానికములు గాఁగఁ
బొంకముగ నెల్లసిరులకుఁ డెంకి యగుచుఁ
బాలమున్నీటిపగిది నాప్రోలు దనరు. ||27||

ఉ. పున్నమచందురుం దెగడుపొంగపుమోములరాచకన్నియల్
గ్రొన్నెలజాలమేలిపనికొప్రపుమేడల నాటలాడ నా
యన్నులకుల్కు లేనగవు లచ్చమవెన్నెలలంచుఁ ద్రిమ్మరున్
వెన్నెలపుల్గుమొత్తములు వేడుక నబ్బలువీట మాటికిన్. ||28||

చ. మినుకుఁగాడానిబంగరువుమేడలసోరణగండ్లవెంట రేల్
చనియెడిరిక్కమొత్తమును జక్కఁగఁ జూచి మెఱుంగుఁబోఁడు లి
చ్చను బిడికిళ్ళఁ బట్టి యవి జాఱి చనం దమగోళ్ళు చుక్కలం
చును నెడ నిల్చి చే వదలి చూచుచు నుబ్బరపోదు రందులన్. ||29||

చ. పగడపుఁగంబముల్ నిలిపి పన్నినముత్తెపుఁజప్పరంబులన్
నిగనిగలాడు కుందనపునిద్దపుగోడల నాఁడెమైనము
త్తిగరతనంపుజిల్గుఁబనితిన్ని యలుల్ బలుదమ్మికెంపుజా
జిగితలుపు ల్గడు న్మెఱయుఁ జెన్ను దలిర్పఁగఁ బ్రోల నెల్లెడన్. ॥30॥

తే. ఇగురుఁబోండ్ల కగడ్తలో నీఁదుచిలువ
చెలువ లిడుతమ్మికెంపులుఁ జెలఁగి కోట
కొమ్మలం దాడుతెఱగంటికొమ్మ లిడెడు
వేల్పుదొరమానికములు నవ్వీటఁ దనరు. ॥31॥

తే. ప్రోలిపల్గోటకొమ్మలఁ బులుఁగుఱాలు
గఱికయని డాసి చెంతఁ జెక్కడపుసింగ
ములను గన్గొని నడుచక్కి బోవ వెఱచి
ప్రొద్దతేజీలు బలువడిఁ బోవుఁ గడల. ॥32॥

క. పన్నుగ నందలియేనుఁగు
గున్నలపై మావటీండ్రు కోరిక లడరన్
మిన్నేటిపసిఁడితామర
క్రొన్ననలను వన్నెమీఱఁ గోయుదు రెపుడున్. ॥33॥

తే. పొడుపుమలనుండి పడమటికడలికరుగఁ
బవలునలుజాములునుబట్టుఁ దొవలసూడు
తత్తడుల కని మాటలో దచ్చికడలఁ
బఱచి క్రమ్మఱు నచటిబాబాతుటుములు. ॥34॥

క. నలుమొగములఁ దా నాలుగు
తొలుపలుకును సదువు టేమి దొడ్డని నలువం
బలికి కలచదువు లెల్లను
బలుకుదు రొక్కొక్కనోరఁ బాఱులు వీటన్. ॥35॥

చ. కలన నెదిర్చెనేనిఁ దిగకన్నులవేలుపు నైన మార్కొనం
దలుఁపుదు రెద్ది వేఁడిన నెదం గని మానక జన్నిగట్టుఁ బె
ద్దలకును బేదసాదులకుఁ దద్దయు నిత్తురు ప్రోల నెప్పుడుం
బొలుపు దలిర్ప రేవెలుఁగుప్రొద్దుకొలంబులరాచసింగముల్. ॥36॥

ఆ. తోలుదాల్పుననుఁగు తొమ్మిదిపాఁతఱల్
రొక్క మున్న దనుచు నిక్కుఁగాని
లెక్క కెక్కుడైన రొక్కంబుఁ దఱుఁగని
కొలుచు గలదు ప్రోలికోమటులకు. ॥37॥

తరలము. మొలకుఁ దెల్లనిబట్ట లేకయు ముచ్చటం గలు ద్రావుచుం
బొలము దున్నఁగ నోడి నాఁగలి పూని త్రిమ్మరు నంచు ని
చ్చలును బల్కుచు నుందు రాకటిసామియన్నను దట్టపుం
గలుముల న్వెలుఁగొంది యచ్చటికాఁపుఁబెద్దలు తద్దయున్. ॥38॥

చ. కులుకుమిటారిగుబ్బలును గ్రొమ్ముడులు న్బిగికౌనులుం బిఱుం
దులుఁ గదలంగఁ జిల్కలను దోలునెపంబున నెల్గులెత్తి గా

జులు గలుగల్లనం జుఱుకుఁజూపులచేఁ దెరువర్లడెందముల్
గలఁపుదు రందులం బొలముకాపరికాఁపుఁదుటారికత్తియల్. ॥39॥

చ. పగడపుఁదీఁగలో తళుకుబంగరుబొమ్మలొ క్రొమ్మెఱుంగులో
తొగచెలితున్కలో మరునితూపులొ బల్రతనంపుఁదేటలో
సొగసులదీవులో యనుచుఁ జూపఱు లువ్విళులూర నందులం
బొగడికఁ జెంది యందములఁ బొల్తురు నీటుగ నాటచేడియల్. ॥40॥

ధర్మ్ముఁడనుఱేని వర్ణనము

క. అవ్వీ డేలు న్మేలని
దవ్వులదొర లెన్న మిగుల ధర్మ్ముఁడు దనతోఁ
జివ్వకు నెదురై నిలిచిన
మువ్వురువేలుపుల నైన మొనసి కలంచున్. ॥41॥

సీ. వెడవింటిబలుదంటఁ బొడసూపఁగా నీక
తోలుదాలుపు నొక్కమూల కనిచి
తొలుమొగల్తుటుముల దూదియ ట్లనియించి
కలువులచెలికాని వెలి యొనర్చి
గాలిమేఁతరిఱేనిఁ గాలూనఁ గా నీక
కడలి నెల్లప్పుడు నడలఁజేసి
వెడఁదమోముమెకంబు నడవుల డాఁగించి
గట్టులయెకిమీనిఁ గడకుఁ ద్రోచి
తే. చక్కఁదనమున వాసిని జాగమునను
జిగిని మాటలలోఁతున మగతనమున
నిచ్చలంబునఁ గడలఁదా నెచ్చుగాంచి
పొగడికలఁ జెందునెపుడు నప్పుడమిఱేఁడు. ॥42॥

సీ. ఎనలేనిమగఁటిమి నెసఁగువాఁ డగుటకుఁ
బొంచుండి కోఁతిని ద్రుంచఁడేని
కోర్కులెల్లను సమకూర్చువాఁ డగుట కూ
రక చుప్పనాక మరల్పఁడేని
కనికరంబుల కెల్ల నునికిప ట్టగుటకుఁ
బొలదిండ్లఁ బొలియింపఁ దలఁపఁడేని
యుడివోనికలుముల నడరు చుండుటకుఁ గా
ఱడవుల దుంపలు గుడువఁడేని
తే. బంతితేరులపంటవలంతిఱేని
కొడుకు దొర యగు నతనికిఁ గడిమి నీగిఁ
గనికరంబున సిరి నంచుఁ గడఁగి పెద్ద
లెన్న నారాచజాబిలి చెన్నుమీఱు. ॥43॥

క. పిఱికితనంబును జలమును
గొఱకొఱ యీలేనిగొనము గుఱి దప్పుటయుం
దుఱుతును బిగియును గల్లయు
నెఱుఁగఁ డతం డించుకయిన నెల్లెడలందున్. ॥44॥

సి. జగడంపుటొరెంపుజడదారికడకేఁగి
చదలేటితెలినీట జలకమాడి
తెఱగంటిదొరయింటితెలిమ్రాఁకు లెగఁబ్రాకి
వలనొప్పఁ దెలిదీవి కెలనమెలఁగి
పలుచందములఁ జిందములఁ గ్రిందుపడఁజేసి
నెలతాల్పుబలువేల్పుచెలువు నవ్వి
చలమాని యలయేనుఁగులసూడు దిగనాడి
మగఱాలజిగినెలఁ దగుచుఁ దెగడి
తే. ముత్తియంబుల నురువుల మొల్లవిరుల
మంచుసోనలఁ జుక్కల నంచగముల
నెంచి కొంచక తనయసం బెల్లకడల
వెలుఁగ వెలుఁగొందు నారాచవేల్పుఱేఁడు. ||45||

క. వెంగలియుఁ బిఱికివాఁడును
దొంగయుఁ గొండీఁడుఁ బేద తులువయు ననికిన్
లొంగినవాఁడును లేఁ డర
యంగా మందునకు నైన నద్దొరపుడమిన్. ||46||

కుంభకుఁ డనుగొల్లదొరకత

క. ఆరామానిక మెప్పుడు
గారవమునఁ బెనుప నందుఁ గదలనిసిరులం
గేరుచుఁ గుంభకుఁ డనియెడి
పేరిటిగొల్లదొర యొకఁడు పేర్మిఁ జెలంగున్. ||47||

తే. వేలుపులఱేఁడు దన కొకవెల్లమొదవె
కల దనుచు నిక్కు నింతియకాని యిట్లు
కలవె పలువన్నియలగిడ్డికదుపు లంచు
నెంచుచుండు నతం డెందుఁ గొంచులే ||48||

సీ. అడిగినఁ గొదుకక పుడమివేల్పులకు ని
చ్చులుఁ బాడిమొదవులఁ జాల నొసఁగుఁ
బేదగేస్తులఁ జేరఁ బిల్చి కోరినయన్ని
దుక్కిటెద్దులఁ బల్మితోడ నిచ్చు
ముదుసళ్ళఁ గడఁగమై వెదకి తా రావించి
నెమ్మిఁ గన్గొని యోగిరమ్ము వెట్టు
నెడపక గీమున కేతెంచువిందుల
కెలమి వల్వాలును సొమ్ములు నొసంగుఁ
తే. జెలిమికాండ్రను బెద్దలఁ గొలమువారిఁ
గూరిమి దలిర్ప సారెకు గారవించు
నొక యరు దగుఁ బుడమిపై నరసి చూడ
గొల్లయెకిమీనినాఁడెంపుగొనములెల్ల. ||49||

తే. చుక్కలను వానచినుకుల నిక్కువముగ
లెక్కయిడవచ్చుఁగాని పెంపెక్కి యెపుడుఁ
బుడమి యానినతెఱఁగున నడరునతని
తొడుకులం దెల్లమిగ లెక్కయిడఁగరాదు. ||50||

క. అమ్మేటిగేస్తునకుఁ గడు
నెమ్మి యొనర్చుచును నిచ్చనిచ్చలు బలుపు
న్నెమ్ములధర్మద యనియెడు
కొమ్మ దనరు నెల్ల మేలిగొనములప్రో వై. ॥51॥

సీ. అనయమ్ముఁ బెఱయిమ్ములను ద్రిమ్మరుచునుండు
చలివెలుంననుంగుఁజెలియ లెనయె?
పెనుఱాఁగయై మ్రోఁగుచును మోసలకునేఁగు
నలుమొగంబులవేల్పుచెలువ దొరయె?
జగమడ్డఁ దగుదొడ్డ సత్తియై బెదరించు
గట్టులయెకిమీనిపట్టి జతయె?
పలుఱేఁడులకు నూడు బలియించి పొలియించి
లలిఁ గేరుపంటవలంతి సరియె?
తే. యివ్వెలందుక కని తనీడుచేడె
లందఱును డెందములనుబ్బి యాడుకొనఁగఁ
జెలఁగి నాఁడెపుఁ బుడమి జేజేలగములఁ
బ్రోదిసేయుచునెపుడు నప్పొలఁతి యలరు. ॥52॥

క. ఉడివోనిసిరుల నిటువలెఁ
దడవెడునయ్యాల్మగళ్ళఁ దనియింతురు సొం
పడర సిరిదాముఁ డనునొక
కొడుకును మఱి నీల యనెడుకూఁతు రొకర్తున్. ॥53॥

నీలావర్ణనము

క. అచ్చిన్నికన్నెసోయగ
మచ్చెలువుం జిల్వచెల్వలందును మఱి య
య్యచ్చరచేడియలందును
నిచ్చలుఁ బరికింపఁ గలుగ నేర దొకప్డున్. ॥54॥

క. చన్నులు జక్కవగిబ్బలు
కన్నులు చెన్నలరునల్లకలువలు పిఱుఁదుల్
దిన్నెలు వన్నెలగని య
య్యన్నులతలమానికంబు నలవియె పొగడన్. ॥55॥

సీ. గొనబారునూగారు కొదమతుమ్మెదబారు
బలుగుబ్బపాలిండ్లు పసిఁడిగిండ్లు
ననుఁ గావిజిగిమోవి ననతేనియలబావి
దొరమించుమైరంగు తొల్మెఱుంగు
నాఁడెంపుజడపెంపు నాఁచుతీవలగుంపు
కలికికన్గవడాలు గండుమీలు
పొగడొందుమొగమెందుఁ దొగలగాదిలివిందు
జిగిలేఁగవునుఁదీవ మొగులుత్రోవ
తే. తళుకులు తరఁగలు చేతులు తమ్మివిరులు
తొడ లనంటులు పిక్కలు దొనలు తళుకుఁ
జెక్కుటద్దంబు లడుగులు చెంగలువలు
బొమలు సింగిణు లమ్మించుఁబోఁడి కరయ. ॥56॥

ఉ. చిందమునందముం దఱుముఁ జేడియకుత్తుక క్రొత్తకప్రపుం
గందముచందముం దెగడుఁ గన్నియనెమ్మొయితావిపిండు లేఁ
జెందొవవిందువన్నియ నిసీ యనుఁ బైదలినెన్నొసల్ బళీ!
కుందన మెందునున్ దొరయెకొమ్మనిగారపుమేనిచాయకున్? ||57||

క. నెలఁతుక చిఱునగవులు వె
న్నెలలం గన నవ్వు లేమ నిద్దపుఁగులుకుం
బలుకులు చిలుకల నులుకఁగఁ
బలుకుం బలుకుదురు వోలు బలుమగఱాలన్. ||58||

తే. అట్లు లేజవ్వనమ్ము సోయగముఁ గల్గి
చెన్నుమీఱుచు నున్నయయ్యన్నుమిన్నఁ
గాంచి తలిదండ్రు లెంతయు గారవమున
నుల్లమున నుబ్బుచున్నచో నొక్కనాఁడు. ||59||

కుంభకునిపాలి కొకబ్రాహ్మణుఁడు వచ్చుట

సీ. తిగరేక లేర్పడ దిద్దిననొసలిను
న్వాలిబూదిబొట్టురంగులు సెలంగ
సరవిఁ జిచ్చఱకంటిదొరకంటిపేరింటి
వేరులు వేరెదఁ బెంపుమీఱ
మొలఁ బింజె వట్టి చెంగులు మాటి కట్టిన
వలిపనీర్కావిదోవతి సెలంగఁ
బైఁ గప్పుకొన్నహొంబట్టుదుప్పటిమెఱుం
గులు నల్గడలఁ గ్రమ్ముకొని వెలుంగఁ
తే. బొత్తములు మేల్కుళాయిపల్ ముత్తియంపుఁ
బోగులునుజాలజన్నిదంబులును గొడుగు
గిండి చెంబును గల్గి ముంగిటికి వచ్చి
నిలిచె వడినొక్కనాఁడెంపునేలవేల్పు. ||60||

చ. నిలిచినఁ జూచి గొల్లదొర నిండినబత్తిని గేలు మోడ్చి య
బ్బలియుఁ డొసంగుదీవనలఁ బల్మఱుఁ గైకొని గొప్పతమ్మికెం
పులు గదియించినట్టిజిగిపుత్తడిముక్కలిపీఁటమీఁద ని
చ్చలముగ నుంచి పూజ లిడి చయ్యన నాతనితోడ నిట్లనున్. ||61||

తే. పుడమిదయ్యమ! యెందుండి వెడలి వచ్చి
తిటకురాఁగర్జమేమి మా కెఱుఁగఁజేయు
మెచ్చుమిముబోఁటిపెద్దలు వచ్చుటెల్లఁ
దోడుతోడనె మేలు చేకూడఁ గాదె? ||62||

తే. అనుడు నగ్గొల్లఱేనిఁ గన్గొని కరంబు
సంతసంబున నలరి యజ్జన్నిగట్టుఁ
గొలముతలమానికము తనవలఁతితనము
గనఁబడఁగ నిట్టులని చెప్పఁగాఁ దొడంగె. ||63||

బ్రాహ్మణుఁడు కృష్ణునిలీలం దెల్పుట

క. విను నీకు బావ యగునం
దునిచెంగటనుండి యెమ్మెతో నీకడకుం
జనుదెంచితి నబ్బల్లిదుఁ
డనుపఁగ మీసేమ మెల్ల నారయుకొఱకున్. ||64||

క. కడు నిడుములఁ బడి వా రి
ప్పుడు మునుపటినెలవు వదలి పోఁకు మిగులఁగం
దొడుకులకు బృంద యనియెడు
నడవికిఁ గాఁపురము వచ్చి రలజడి మీఱన్. ||65||

క. మిగులఁ గడగండ్లఁ బడియుం
దెగకయు వా రెల్ల నిపుడు నీమేనల్లుం
డగుకఱివేలుపుకతమున
నొగి నుసుఱులతోడి నిల్చి యున్నారు సుమీ. ||66||

తే. అతఁడు గావించుకర్జంబు లరయ నొక్క
మోము గలిగినమానిసి యేమి దెలుపు
మీఱఁగా నాలుగైదాఱు నూఱుపదులు
నోళ్ళు గలవారికిని బూని నుడువరాదు. ||67||

క. విను సిరిమంతుఁడు కడువ్రేఁ
గున నడరెడు పుడమిపడఁతికొఱకును జేజేల్
మును వేఁడుకొనిన మానిసి
తనము గనినవెన్నుఁ డతఁ డెదం బరికింపన్. ||68||

క. ఆచంద మెల్ల దిటముగ
నీచెవులకుఁ దనివి దీఱ నే నెఱిఁగింతున్
రాచపను లిపుడె తలఁపం
జూచుకొనక యాలకింపు స్రుక్కనితెలివిన్. ||69||

సీ. మును సోఁకుమూఁకల మోవ నోపక నేల
　　చేడియ దలఁకి జేజేలఁ గూడి
చదువులవేలుపు మొదలు వెన్నునిచెంత
　　కరిగి చాఁగిలి మ్రొక్కి సరగ లేచి
యాయన కత్తెఱం గంతయు నెఱిఁగించి
　　జియ్య యిప్పని జాగు సేయఁ బోక
కావింపవే యని కడు వేఁడుకొనిన న
　　వ్వేల్పుల కవ్వేల్పు వెరపుదీఱ
తే. నిప్పని యొనర్తుఁ బొండు మీరిండ్ల కనుచు
ననిచె ననిచిన కూర్మితో నపుడు తొగల
యనుఁగుకొలమున వసుదేవుఁ డనెడుదొరకుఁ
గొమరుఁడై పుట్టె నెంతయుఁ గొమరుమిగుల. ||70||

ఆ. పుట్టి కంసుఁ డనెడునట్టిరాకాసుల
ఱేనివలన నూడు తోనె పూని

నందునింటఁ జేరి నందునియిల్లుటా
లగుయశోద పాపఁ డనుచుఁ బెనుప. ॥71॥

తే. అత్తెఱంగునఁ బెనుచుచున్నంత నొక్క
యెడను బూతనయనుపేర నడరుపెరను
నల్లఁద్రావుడుఁబడఁతి మత్తిల్లి చేరి
విసపుఁబాలిడఁ గని దాని యుసుఱుగొనియె. ॥72॥

ఆ. దండఁ గొండపోల్కి నుండునో నొండెడ
దండితనము మీఱ నండగొనక
పిండిపిండిగాఁగ రెండుకాళులఁ దాచి
దండి బండిపొలసుదిండిఁ జెండె. ॥73॥

క. దొరఁకొని తనుఁ బొదివి కడున్
సరగను జదలికిని నొగిని జనుబేరజపుం
గరువలిబలుతొలుజేజే
నరుదుగ గుదెతాల్పువీటి కనిచెం గడిమిన్. ॥74॥

సీ. బుడతకల్వలవిందుఁ బోలునెన్నొసలిపై
　　　　జెలువంపురారేక చిందులాడ
మొలఁ బట్టుదిండుపైఁ జెలువొందుగంటల
　　　　బంగారుమొలత్రాడు రంగు లీన
నెదఁ గ్రొత్తపులిగోరు లొదవినపతకంబు
　　　　బలుముత్తియపుసరంబులును బొదలఁ
జేతుల రతనంపుజిలుఁగుటుంగరములు
　　　　మురువులు నెనలేని మురువు సూప
తే. మెట్టదమ్ములనందియల్ బిట్టుమొరయ
దిట్టతనమునఁ జెలరేఁగి పట్టపగలె
నెట్టుకొని యెల్లవ్రేతల నట్టులందు
గుట్టు లరయుచు మెలఁగు నప్పట్టి మఱియు. ॥75॥

సీ. తలిరుఁబాయపుముద్దుఁ జెలువలఁ గనుగీఁటి
　　　　వలరాచపనులకు వలసి పిలుచుఁ
జల్ల లమ్మఁగఁ బోవు గొల్లకొమ్మల నడ్డు
　　　　కొని సిగ్గు లెడలించి యెనసి కేరు
మగలతో నిదురించు మగువల మఱపించి
　　　　మగచెయ్వు లొనరింప మదిఁ దలంచు
నారాటమునఁ బొంగి నీలాటిరేవులఁ
　　　　గాంచి కన్నెల బల్మిఁ గవయఁ జూచుఁ
తే. జిన్నపాపలఁ గూడి బ ల్మున్నరకల
నన్నిగీముల సన్నక సన్నఁ దూటి
యున్నమీఁగడపెరుఁగుపాల్వెన్నజున్ను
లన్నియును గొల్లనాడు నవ్వన్నెలాఁడు. ॥76॥

సీ. వెనుమిన్కుగోనత్రోవలను మెలంగెడుఱేఁడు
　　　　చెలఁగి వ్రేతలయిండ్ల మెలఁగుచుండుఁ
గోరి నిరాబారు రారసి కనలేని

బలియుండు గొల్లలఁ బాయకుండుఁ
గడఁగి జన్నపుదిండ్లు దొడరఁ ద్రిమ్మరుప్రోడ
కుఱ్ఱలగమితోడఁ గూడి యాడుఁ
గలిమిపూఁబోడితోఁ గదిసి కేరెడుమేటి
గొల్లకన్నియలతోఁ గూడి కేరు
తే. లెక్కలిడరానిరాయంచజక్కజోదు
గ్రుడ్డుఁబనఁటులు నిండారు గొప్పబొజ్జఁ
బూనుపెనుదంట వ్రేపల్లెలోనఁ గల్గు
జున్నుపెరుఁగులు మ్రుచ్చిలి జుఱ్ఱుచుండు. ||77||

వ. అంత. ||78||

క. బిట్టలిగి వ్రేత లొగిఁ దన
రట్టడిచందములఁ దెల్పి రాయిడి వెట్టం
గట్టలుకఁ దల్లి ఱోలం
గట్టిన వడి నేఁగి మద్దికవ పెకలించెన్. ||79||

ఆ. అట్టియావడులకు బిట్టు గాసిలి గొల్ల
లెల్ల బృందలోని కిపుడు సేరి
రందు విసపుమ్రాకు లైయున్నచెడుగురే
ద్రిమ్మరుల నడంచి తమ్మికంటి. ||80||

సీ. బంగారుఁదగటుదుప్పటి బిగ్గ మొలఁ జుట్టి
కేల జొక్కపుఁబిల్లఁగ్రోలు పట్టి
పెంపారుబలునెమ్మిపించె మౌదలఁ బూని
చెవిని జేఁకటిమ్రానిచివురు దుఱిమి
సొగసుగా నొసలఁ గస్తురిబొట్టు సవరించి
క్రొన్ననసరము లక్కున నమర్చి
గురివెందపూసపేరొరయ సందిటఁ గట్టి
సన్నంపుసెలగోల చంక నిఱికి
తే. చెలిమికాండ్రను గూడి నిచ్చలముమీఱఁ
గడఁకతోనాలకదుపులఁ గాచుకొనుచు
గొమరు దళుకొత్త ననయంబు జమునపొంత
మెలఁగు నెనలేనిహొయల నమ్మేటివేల్పు. ||81||

తే. మరుని రేఱేని జేజేలదొరకొమరునిఁ
బూసనెలతాల్పుచెలిపట్టిఁ బోలఁ జాలు
వానిచెలువంబు నుడువులఱేని కైనఁ
బూని దిటముగ వాక్రువ్వఁ బోలదెందు. ||82||

సీ. తెలిదమ్మిఱేకులఁ దెగడుకన్నులవాఁడు
తొగలనెచ్చెలి నేలుమొగమువాఁడు
మింటునందమమించు మెఱుఁగుఁజెక్కులవాఁడు
కొదమతేఁటుల గేరుకురులవాఁడు
మెట్టదమ్ములపొల్చు మెట్టుమెట్టలవాఁడు
తరఁగచాలు నదల్చుతఱులవాఁడు
వలుఁద చిందము నెగ్గు పలుకుకుత్తుకవాఁడు

జడలమెకంబుఁ బోల్పడుమువాఁడు
తే. మొల్లమొగ్గలనెనయుపల్మొనవాఁడు
పొదలుచిగురాకుదొరయుకెంబెదవివాఁడు
తొలుమొగుల్వేగతరుముమైచెలువువాఁడు
చెన్నుగలవాఁడు వలఱేనిఁగన్నవాఁడు. ॥83॥

కుంభకునికనుసన్నచే నీల బ్రాహ్మణునకు మ్రొక్కుట

క. అని యిత్తెఱఁగునఁ బాఱుఁడు
వినిపించిన గొల్లఱేఁడు వేడ్కలు మదిలో
ననలెత్తఁగఁ దనమ్రోలం
గనుపట్టు ననుంగుఁబట్టిఁ గనుఁగొల్పుటయున్. ॥84॥

సీ. కొదమతుమ్మెదదిమ్ము నదలించు ముంగురు
ల్నొసలిపై ముసరి తుంపెసలు గూయ
జిలుఁగుఁబయ్యదలోనఁ దులకించుకోడెచ
న్నొగడలు డాఁగురుమూఁత లాడ
గొప్పపిఱుందువ్రేఁగునఁ దడఁబడునడల్
గుడుగుడుగుంచ మింపడర నాడ
మురిపంపునగవులు ముద్దులేఁజెక్కులఁ
బొదలుచు వెన్నెలప్రోవు లాడ
తే. గొనములకునెల్ల నాటపట్టనఁగఁజాలి
జాలువాబొమ్మపోల్కి నన్నెలవెల్వ
జింకతాలుపుచెంగటఁ జేరి యడుగుఁ
దమ్ములకు మ్రొక్కులిడియున్న కొమ్మఁ జూచి. ॥85॥

క. పలుతెఱఁగుల దీవనలిడి
వలనుగ నత్తమ్మిచూలివంగడపుంజా
బిలి యలఱేనిం గని యి
చ్చెలి యెవ్వరిపడుచు తెలియఁ జెప్పుము దీనిన్. ॥86॥

నీలకుఁ దగినవరునిగుఱించి బ్రాహ్మణుఁడును గుంభకుఁడును మాటలాడుట

క. అరచేతివ్రాలు చూచిన
దొర యెందును లేనిదొడ్డదొరఁ జేకొని బల్
సిరుల నిరవందఁగల దీ
విరిఁబోఁడి జగంబులెల్ల విరివిగఁ బొగడన్. ॥87॥

తే. గొప్పకన్నులు నిడువాలుఁగురులుఁ జెలఁగు
కౌనుఁ గెంజాయ నలరుకేల్గవయు నడుగు
లును మొనల్గలపలుచాలుపును దనర్చెఁ
గన్నియలమిన్న కివియె మేల్చిన్నె వన్నె. ॥88॥

చ. అనుటయు బాఁపనయ్య కతఁ డర్మిలి నిట్లని పల్కె దేవరా!
విను మిది నాదుపట్టి కడువేడుక నెప్పుడు నీల యంచు నీ

గొనములప్రోకఁ బిల్తు మిదిగో నిపు డిననఁబోఁడి కందమౌ
పెనిమిటిఁ గూర్చి సొంపలరఁ బెండ్లి యొనర్చ మదిం దలంచెదన్. ||89||

క. ఈకన్నియకుం దగునొక
రాకొమరుని నరసి నిబ్బరంబుగ నిపుడే
మా కెఱిఁగింపుడు తెలియ
న్మీకుం గనరాని దొకటి నేలం గలదే? ||90||

క. నందుఁడు మాకున్ గాదిలి
బందుగుఁ డాతనికి నొజ్జ బాఁపఁడ వగుటన్
డెందమునకు నీపలుకులు
పొందుగఁ బ్రాఁబల్కునుడువుపోలిక సుమ్మీ. ||91||

చ. కొలమును గల్మి తాల్మియును గూర్మియుఁ దెంపును జవ్వనంబునుం
జెలువము విద్దెయున్ గొనముఁ జేవయుఁ బ్రోడతనంబుఁ దెల్వియుం
గలిగినపిన్నపాపనికిఁ గన్నె నిడం దగునంచుఁ దీర్పరు
ల్పలుకుదు రట్లు గావున వలంతికి నీ కిఁకఁ జెప్ప నేటికిన్? ||92||

తే. అనిన నతఁ డాతనికి నిట్టులనుచుఁ బలికె
వినుము నాయఁడ! నామాట వీనులలరఁ
బేర్మి నీకన్నియకుఁ దగుపెండ్లికొడుకు
వెన్నతెక్కలికాఁ డైనవేల్పు సుమ్ము. ||93||

క. వానికి నెనయగువాఁ డెం
దైన న్మఱి కలఁడె పుడమి నటుగాకయు నీ
మేనల్లుం డతనికి ని
చ్చానం బెండిలి యొనర్పఁ జను నరయంగన్. ||94||

మ. వెడఁగుంజాడలఁబోక నాపలుకు నీవీన్దోయి కింపైనఁ దెం
పడరన్వెన్నునికిమ్ము కన్నియను నెయ్యంబొప్ప నీచొప్పుగా
నుడువుల్వేయు నిఁకేల డెందమునఁ గన్గొమ్మెన్న నీకిప్పుడా
నుడివాల్దాలుపుకన్న వేఱు కలరే చుట్టంబు లేవంకలన్? ||95||

క. కావునఁ గొదుకక కఱిమై
దేవర కీకన్నె నిమ్ము తిరమగుమదితో
నావుడు నాతం డట్టుల
కావించెదఁ జుమ్ము వేడ్క గడలుకొనంగన్. ||96||

తే. నేలవేలుప! నందుని ప్రోలి కరిగి
యన్ని తెఱఁగుల నతనికి వెన్నునికిని
గన్నెలాగెల్ల నెఱిఁగించి కర్జ మీవు
నేర్పు మెఱయంగ వడి సమకూర్పవయ్య. ||97||

క. నీకుం జెప్పెడిదే మిఁక
నీకర్జపువ్రేఁగుఁ బూని యేఁగుము మఱి మీ
రేకద మముబోటులకుం
గైకొని మేల్పనులు గూర్పఁగాఁ దగువారల్. ||98||

తే. అనుచుఁ బెనుమానికములు దాపినవెడంద
పతకమును దావళంబును బసిఁడియుంగ
రములుఁ బ్రోఁగులుఁ బట్టుఁబుట్టములు మొదలు
గలుగుతొడవులు గడుమడుగర లొసంగి. ॥99॥

చ. పనిచినఁ దద్దయుం బొదలి పాటెడువేడ్కలవెల్లిఁ బెల్లుగా
మునుఁగుచు నేలవేల్పుతల ముందరిపల్లియ కేఁగె గొల్లఁడున్
గొనకొని ముద్దుఁగన్నియకుఁ గోరినయట్టిమగండు గల్గెనం
చును దనయాలుఁ దాను నెదఁ జొక్కుచు సోలుచు నుండె నెంతయున్. ॥100॥

నీల కృష్ణునియందు వలపుఁగొని తనలోఁ దలపోసికొనుట

తే. అంత నీలయుఁ దనతండ్రిచెంత మిగుల
సంతసంబునఁ బంటవలంతివేల్పు
దొంతరగ నన్న కఱివేల్పువింతలెల్ల
మంతనంబునఁ దలఁచుచున్నంతఁ బొగిలి. ॥101॥

ఉ. ఎన్నఁడు సూతు ముజ్జగములేలెడువేలుపుమోముఁదమ్మినిం
కెన్నఁడు విందు వీనుఁగవ కింపుగ వెన్నునిముద్దుఁబల్కులా
వన్నెలప్రోకయొదలను వావిరిఁ బల్తెలిముత్తియంపుఁబ్రా
లెన్నఁడు నింతు నింతులపుడెంతయు నెమ్మిని సంతసిల్లఁగన్. ॥102॥

సీ. వెన్నునిచిఱునవ్వువెన్నెలల్ పర్వక
వలపుఁబెంజాఁకటుల్ దొలఁగఁగలవె?
గుడుసుఁగైదువుజోదు సుడివాన గురియక
కడువిరాలపుటగ్గి యడఁగఁ గలదె?
కఱివేల్పుచూడ్కిజక్కర లుబ్బి పాఱక
బలుగ్రచ్చుఁబైరులు పండఁగలవె?
మలతాల్పుమెయిచాయమబ్బులు గ్రమ్మక
యెదకాఁకపెన్నెండ వదలఁగలదె?
తే. సోఁకుమూఁకలగొంగ మెచ్చుగనుదాళి
బొట్టుమూసికతోఁగూర్చి పొసఁగ నఱుతఁ
ద్రాడు గట్టగ సొగసెల్ల దఱిమి యొడల
వ్రేలువలరాచబలుబూచి వీడఁగలదె? ॥103॥

క. తొలునోములమే లిప్పుడు
వలనుగఁ జేకూడవలదె వన్నెలగని యై
యలరెడువలమురితాలుపు
చెలిమి వెసం గలిగి యెల్ల చెలులుం బొగడన్. ॥104॥

సీ. పులుఁగుడాల్వేల్పు కెందలివాతెఱతేని
యలు గ్రోల నెన్నఁడు గలుగునొక్కొ!
తమ్మిపొక్కిటిమేటిఱొమ్మునఁ గులుకుగు
బ్బలు చేర్ప నెన్నఁడు గలుగునొక్కొ!
చుట్టుఁగైదువుజోదు మెట్టదమ్ములఁ గేలుఁ
గవనొత్త నెన్నఁడు గలుగునొక్కొ!
చిలువపానుపువానితళుకుఁజెక్కులముద్దు

గైకొన నెన్నఁడు గలుగునొక్కొ!
తే. వలపు గులుకంగఁ బసిఁడిదువ్వలువతాల్పు
మేన గొజ్జఁగపూనీటిమెఱపుటింపుఁ
గప్పురంబు జవాదియుఁ గలిపి యిడ్డ
కలప మలఁదఁగ నెన్నఁడు గలుగునొక్కొ! ||105||

ఉ. వెన్నునిచెంత నప్పుడమివేలుపుమానిక మేమి దెల్పునో
చెన్నుగ నన్నియుం దెలిసి చెల్వుఁడు దా నెటుగాఁ దలంచునో
క్రొన్నెలతాల్పుముద్దియను గూర్చి యొనర్చిననోము లిప్పు డే
వన్నెను బండునో నలువవ్రాఁతతెఱం గిఁక నెట్టులుండునో. ||106||

క. చెలువమును జవ్వనంబును
జెలిమియు నెఱజాణతనము సింగారంబుం
దలఁపున మెలఁగెడుగొనమును
గలమగఁ డెనలేనితొడవు గద తొయ్యలికిన్. ||107||

చ. ఎడపక రేయియుం బగలు నెమ్మొల నమ్మలతాల్పుఁ గూడి పూ
వడిదపుజోదునిబ్బరపుటాలమునం దమి హెచ్చ వొచ్చె మె
య్యెడలను లేనిబల్టొయలు నిమ్ముగఁ గోరుచుఁ జాలఁబ్రోడలై
యడరెడుగొల్లకన్నె లహహా తొలుబాముల నేమినోఁచిరో. ||108||

సీ. తెలిదమ్మికంటివాతెఱ యాన ముం దెంత
పెనువంతఁ గుందెనో పిల్లఁగ్రోవి
రక్కసిగొంగపే రక్కున వ్రాలునం
దుల కేమి నోఁచెనో తొలసిపేరు
సిరిఱేనినిద్దంపుఁజెక్కు లబ్బఁగ నెంత
గొలిచెనో మును గొండగోఁగుఁబువ్వు
లాలకాపరిమేన నలరంగ నేమేలు
సలిపెనో హొంబట్టుసన్నసాలు
తే. దుక్కివాల్దాల్పునసుఁగుసైదోడుమ్రోలఁ
దొడరి యనయంబు నాడంగఁబడసినట్టి
పురిపులుఁగుమొత్త మెనలేనిపున్నియంబు
లేమిచేసెనొ సెగకంటిసామిఁ గూర్చి. ||109||

చ. దిట మగుచెల్వమున్ గొనముఁ దేజును గల్గినముద్దుగుమ్మకుం
దటుకున నొక్కపాలసునిఁ దారిచి బిగ్గర నంటఁ గట్టి చొ
క్కట మగునేపువాని కొకగ్రద్దఱిజాడలచేడెఁ గూరుచుం
గటకట తమ్మిచూలికొఱగాములు బాములుగాఁ దలంచెదన్. ||110||

సీ. ముసిఁడిమ్రాఁకునఁ బండ్లు పస మీఱఁ గల్గించి
యించున కేల పుట్టించఁడయ్యెఁ
బిల్లగడ్డకుఁ దావి పెల్లుగా నొనఁగూర్చి
కుందనంబున కేల కూర్పఁడయ్యెఁ
బందిపంటికి నైదుపదియుఁ గూనల నిచ్చి
పొసఁగ నేనిక కేల యొసఁగఁడయ్యెఁ
గాకిపిట్టకుఁ జాలఁ గడలేనిబ్రదు కిడి
చిలుకకు దడ వేల చేయఁడయ్యెఁ

తే. గొలముకొఱంత గరాసుల కలవిగాని
దొరతనము గూర్చి కడుబల్లిదుల కదేల
తిరిప మెత్తంగఁ జేసె నద్దిర కరంబు
వింత లయ్యెను జదువులవేల్పుపనులు. ॥111॥

వ. అని మఱియును. ॥112॥

తే. పాలమున్నీటిగారాపుఁబట్టిమగఁడు
వేడుకలు మీఱ ననుఁ బెండ్లియాడెనేని
గొప్పచింబోతుకదుపులఁ గూర్చి నీకుఁ
గావువెట్టింతుఁ జుమ్మి యోగంగనమ్మ. ॥113॥

తే. పూని యౌదలఁ దలఁబ్రాలువోసి తాళి
బొట్టు మరుతండ్రి తనమెడఁ గట్టెనేని
వెండిపువ్వుల నపరంజివిరులచేతఁ
జెలఁగ నించెదఁ గోరి యోచిలువతాల్ప. ॥114॥

క. తనతలపై వడి బల్లిదుఁ
డనువొప్పఁగ గ్రొత్తముత్తియపుఁదలఁబ్రా ల్వో
సినఁ దఱుఁగనుయుండ్రంబులు
వెనకయ్యా నీ కొసఁగుదుఁ బ్రిదులనిబత్తిన్. ॥115॥

క. అని యెడ యెదవనికోర్కుల
మునుఁగుచు నిలువేలుపులకు మ్రొక్కుచ నాక్రొ
న్ననఁబోడి పలుతెఱంగులఁ
దనలోనం దానె యపుడు తలఁచుచునుండెన్. ॥116॥

తే. అనుచు నుగ్రశ్రవసుఁ డింపు పొనర నెల్ల
తపసిఱేండ్లకు నెఱిఁగింపఁ దనివి సనక
వార లవ్వలికతయును వలను మీఱఁ
దెలుపవే యని సడ్డతోఁ బలుకుటయును. ॥117॥

ఆ. మత్తగిల్లుసత్తుగిత్తతత్తడి నెక్కి
మిత్తి మొత్తి సత్తి నత్తి బత్తిఁ
బత్తి రిడిన ముత్తిబుత్తులు రెండును
నొత్తిగుత్తగట్టుచుండుఱేఁడ. ॥118॥

ఉత్సాహ. మొలను దోలుఁ దలను జాలు మొనలువాలు నిండువె
న్నెలలఁ బోలునొడలిడాలు నీటుదేలుచిల్కమైఁ
జెలఁఘునాలు మలను బ్రోలుఁ జెడని మేలు గల్గి వి
చ్చలును సోలుకొనుచుఁ గ్రాలు జగములేలువేలుపా.

గద్యము. ఇది శ్రీమదుమారమణకరుణాకటాక్షమిరీక్షసంలబ్ధ సరసకవితాసామ్రాజ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యస గోత్రపవిత్ర కూచిమంచి గంగనామాత్యపుత్త్ర బుధజన విధేయ తిమ్మయనామధేయ ప్రణీతంబైన నీలాసుందరీపరిణయం బనునచ్చతెనుఁగుఁ బ్రబంధమునందుఁ బ్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము

క. సిరుల నిరవొందుగట్టుల
దొరకూరిమిపట్టిఁ గూడి తోరపుహొయలం
దిరమగునెమ్మిం జెలఁగుచు
సరిమీఱినవన్నెకాఁడ! జగములఱేఁడా! ||1||

తే. విను నిరాబారిఱేండ్ల కవ్వేట్టచెవుల
తపసిరాయఁడు దనదుడెందంపుఁదమ్మిఁ
గ్రమ్ముకొనువేడ్క నవ్వలి కతయుఁ జాల
నెలమి నెఱిఁగింపఁగాఁ బూని యిట్టులనియె. ||2||

బ్రాహ్మణుఁడు నందునితో వివాహవార్తను మాటాడుట

ఉ. బల్లిదులార! నందుఁ డనుప న్మను వెళ్ళినజన్నిగట్టు ప్రే
పల్లెకు సంతసంబు మదిఁ బర్వఁగఁ గ్రమ్మఱఁ బోయి వేగయా
గొల్లకొలంపుఁబాల్కడలిక్రొన్నెలఁ గన్గొని వానికెంతయుం
దెల్లమి గాఁగ నిట్లనుచుఁ దెల్పఁదొడంగెను నేర్పుపెంపునన్. ||3||

క. ఒడయండ! నీదుపంపునఁ
గడువడిఁ జని నీమఱందిఁ గనుఁగొని యతఁ డ
య్యెడ నిడుపూజల నెంతయు
నడరఁగఁ గైకొని కరంబు నర్మిలి మీఱన్. ||4||

ఆ. అతనిసేమ మెల్ల నరసినపిదప మీ
సేమ మతని కెఱుఁగఁ జెప్పి మేలి
రతనములఁ దనర్చు రవణమ్ములును బట్టుఁ
బుట్టములను మిగులఁ బుడుకు లంది. ||5||

క. వచ్చునెడం దనకన్నియఁ
దెచ్చి యతం డెదుట నిలిపి దీనికి నెన యై
మెచ్చు గను పెండ్లికొడుకును
నిచ్చలముగఁ దెల్పుమనుచు నెఱిఁ బల్కుటయున్. ||6||

తే. నీకు మేనల్లుఁ డగువెన్నునికి నొసంగు
చాన నని పల్క నతఁ డంత సంతసిల్ల
వేయిదెఱఁగుల మీ కిది విన్నవించి
కర్జ మొనగూర్పుమని కోర్కి గదురఁ బల్కె. ||7||

క. కుందనపుబొమ్మ పోలిక
నందంబుల కెల్ల నిక్కయగునమ్ముద్దుం
గెందలిరుఁబోఁడి బెండిలిఁ
బొందుగ నొనగూర్పు పసిడిపుట్టము దొరకున్. ||8||

తే. తడయఁ బనిలేదు మేల్పని తగినచోటఁ
దగిన నొనరింపు మనుచుఁ బెద్దలు గడంగి
యాడుచుందురు గావున నతనితోడ
వియ్యమందంగఁ దగుఁ జుమ్ము వేయు నేల? ||9||

క. అని బాఁపనయ్య యిత్తెఱఁ
గున నేర్పున విన్నవింప గొల్లలతేఁ డ
ప్పని కియ్యకొని కరంబును
దనమదిఁ గడలేనివేడ్కఁ దనరుచు నుండెన్. ||10||

కృష్ణునికి బ్రాహ్మణుఁడు నీలను వర్ణించి తెల్పుట

తే. పాఱుఁ డపుడెదఁ గడుఁబెంపుమీఱ నెలమి
నాలకాపరికడకు డాయంగఁజేరి
సంతసంబున నతనితో నంత కంత
కింపు దళుకొత్త మెల్లన నిట్టు లనియె. ||11||

సీ. విను సామి! నీతండ్రిపనుపున నీమామ
యగుకుంభకునియింటి కరుగుదెంచి
యతనిసేమంబెల్ల నారసి మీసేమ
మెలమితో నతనికిఁ దెలియఁ జెప్పి
యమ్మేటి యిడుమానికమ్ములు సొమ్ములు
వలువలుఁ గైకొని వచ్చునెడను
దనముద్దుఁబట్టి నీలను దోడితెచ్చి యెం
తయు నెమ్మి దీనికిఁ దగిన పెండ్లి
తే. కొడుకుఁ దెల్పు మటంచు నన్ గూర్మి నడిగి
మిమ్ముఁ జెప్పిన నతఁ డపు డెమ్మె నలరి
నందునకు మీకు నెఱిఁగించి పొందుమీఱ
నయ్య! యిప్పని యొడగూర్పు మనుచు వేఁడె. ||12||

తే. జాను మీఱినచానయు మేనమామ
కూఁతురును లేఁతపరువంపుగుబ్బెతయును
నెవరు కదిసిన దగుటను నీకు దాని
కోర్కు లివురొత్తఁ దవులుకోఁ గూడు నొడయ. ||13||

క. ఆకన్నియసోయగ మో
రాకాసులసూడ! పాఁపరాకొమ్మలయం
దేకడ నరసిన లేదు సు
మీ కడమ యిం కేల తెల్ప మీకడ మఱియున్. ||14||

ఆ. చామమోముగోము చందమామను గెల్వఁ
జాలు మేలుతేనెజాలుఁ బోలుఁ
గలికికులుకుఁబలుకు లలవెలందుక గొన
బారనారు తేఁటిబారుఁ గేరు. ||15||

ఉ. చిందము చందమామ సుడి సింగము రిక్కలు నువ్వుఁబువ్వుమేల్
చెందొవ లద్దముల్ చివుర చిల్వ మొగు ల్తరఁగల్దొనల్నన

ల్కుందన మంచబోదలును గుబ్బలులు న్మగజాలతిన్నలుం
బొందుగఁ గూర్చి యమ్మెఱుఁగుఁబోడిని నల్వ యొనర్పఁబోలుఁబో. ॥16॥

సీ. అడుగులు చెందొవలారుతుమ్మెదబారు
కన్నులు వాలికగండుమీలు
కుత్తుక చిందంబు గుబ్బలు జక్కవ
ల్వెమ్మోము విరిదమ్మినెఱులు నాఁచు
నగవులు నురువులు నడలు రాయంచలు
స్రుక్కులు తరఁగలు పొక్కిలి సుడి
మీఁగాళ్ళు తాఁబేళ్ళు మెఱుఁగుఁజేతులు తూండ్లు
చెన్నారుపిఱుఁదులు దిన్నియలును
తే. గాఁగ ననయంబుఁ బలుసోయగంపుఁగొలఁకు
నాఁగ నలువొందు నయ్యేలనాఁగబాగుఁ
బొగడ నలవియె పలుకులపొలఁతి కైనఁ
జిలువదొరకైన మఱియు నన్నలువకయిన. ॥17॥

ఆ. కెంపుఁ బెం పడంప సొం పగువాతెఱ
మిన్నుఁ జెన్ను నెన్నుఁ గన్నెనడుము
మీల నేలఁ జాలు వాలుఁగన్నుంగవ
తేఁటిదాటు మీటు బోటికురులు. ॥18॥

చ. పలుకులఁ దేనె లూరు మెయి బంగరునిగ్గులు దేఱుఁ జూపులం
దళుకులు మీఱుఁ జెక్కులను దద్దయు ముద్దులు గాఱు మోమున
న్వల పలరారుఁ గ్రొమ్మొగలువన్నియఁ గేరును గొప్పు తీ రహా!
చిలుకలకొల్కిసొరు నెఱిఁ జెప్పఁగ నల్వకునైనఁ దీరునే? ॥19॥

సీ. ఎలనాఁగతుఱుమున కెనగాక తుమ్మెద
కొదమకూటువులు పల్వొదలు దూఱెఁ
జానవేనలితోడ సరిగాక యొడలిచూ
పులదొరరతనముల్ పూరిఁ గఱచె
నతఁబోడినునుఁగొప్పునకు దీటుగాక ని
చ్చలును జీఁకటులు మూలలను డాఁగెఁ
గడుముద్దుగుమ్మక్రొమ్ముడితోడ దొర గాక
తొలుమబ్బుతుటుములు మలలఁ బట్టెఁ
తే. జూపఱకుఁ గొలఁదికి మీఱుసొంపు నింపుఁ
బెంపుఁగలయలచెలిచెలువంపునెఱుల
గుంపునకు జోకగాక నిద్దంపునాఁచు
జొంపములు నీటఁ బడుఁ గడుఁదెంపుచేసి. ॥20॥

తే. మగువమొగమున కెన గాక మిగులఁ బొగిలి
తొగలచెలికాఁడు పదియాఱుతునియ లయ్యె
సిరుల కిర వగునెత్తమ్మివిరి దలంకి
యొయ్య నొయ్యన వేమాఱు వ్రయ్య లయ్యె. ॥21॥

తే. పగడము మంకెనవిరియును
జిగురాకును దొండపండుఁ జెందిరమును సొం

పగతమ్మి కెంపుగుంపును
ముగుదనిగారంపుఁదొగరుమోవికి దొరయే? ||22||

ఉ. పట్టికముందె క్రొన్ననలబంతులు గందును గోరు నాటఁగ
న్గట్టిగ నుండుఁ గొండలును గైకొన నబ్బక పోవు జక్కవల్
పట్టుగ రాసినం గరఁగి పారెడు మేలిపసిండిగిండ్లు నిం
కెట్టుగ నీడనం బొసఁగు నింతిమిటారపుగుబ్బదోయికిన్. ||23||

క. కొండలమెండును మారెటి
పండులసోయగము జక్కవలకూడిక పూఁ
జెండులపసయును బంగరు
కుండలమెఱుఁగు న్వెలందిగుబ్బల కడఁగున్. ||24||

తే. అలరుపొక్కిటపొన్నపూవలన వెడలి
కులుకుఁజన్గుబ్బతమ్మిమొగ్గలకు సాగు
జమిలిముక్కాలికొదమపెంజాలనంగ
నలరుఁబోఁడికి మెఱుఁగారునారు దనరు. ||25||

ఉ. దానిపిఱుందునందమును దానిమిటారపుటారుసౌరునున్
దానివెడందపెందుఱుము దానిచొకారపుగబ్బిగుబ్బలున్
దానిజగానిగారమును దానియొయారపుఁదళ్కుఁజూపులున్
దానిమొగంబుఁ గన్న జడదారులకైన విరాళ మెత్తదే? ||26||

సీ. వలపులదీవి కెందలిరుజొంపముమావి
మరునిపూఁదూపుచేమంతిబంతి
యన్నులతలమిన్న యాణిముత్తెపుఁగ్రోవ
పండువెన్నెల నిగ్గుబలుకుఁజిలుక
కపురంపుబరణి నిల్కడఁ గన్న క్రొమ్మించు
పగడపుఁదీవ మేల్పసిఁడిబొమ్మ
కొదమరాయంచ కుల్కుమిటారి వన్నెల
గని చొకారపుమానికములమూట
తే. యాముటేనుఁగుగున్న యొయ్యారములకుఁ
దీరుకస్తురిలప్ప సొంపారుపికిలి
చెండు నాఁగఁ దనర్చి యచ్చెరువుమీఱఁ
దద్దయుఁ జెలంగుఁజుమ్మ యమ్ముద్దుగుమ్మ. ||27||

మ. పలుకు ల్వేయు నిఁకేల యాచెలువ యాబంగారుకీల్బొమ్మ యా
కులుకుంబాయపుఁగల్కి యావలఁతి యాగొజ్జంగపూబంతి యా
యలరుంబోఁడులమిన్న యాముగుద యాయందంపురాచిల్క యా
వలపుంగప్రపుదీవి యామగువ యావాల్గంటి నీకే తగున్. ||28||

తే. చక్కఁదనమును గొనమును జవ్వనంబు
మక్కువయుఁ బ్రోడతనమును నిక్కువంబుఁ
దాలిమియుఁ గల్గునిల్లాలి నేలువాని
కారయఁగ వేల్పురాచప్రో ల్గోర నేల? ||29||

చ. చెలువుఁడ! నీయెడం జెవులు చీఁదఱఁ జెందఁగఁ బెక్కులాగులం
బలుకఁగ నేల? యాతలిరుఁబాయపుటన్నులమిన్నచెల్మి నీ

కలవడెనేని మేలిపదియాఱవవన్నెపసిండితోడ వే
ల్పులదొరమానికంపురవఁ బొందుగఁ గూర్చినచంద మౌఁజుమీ. ॥30॥

తే. ప్రోడలై చూడఁ దగుగొల్లపూవుఁబోండ్ల
చెలిమి గలదని దానిపైఁ దలఁపుమాన
వలదుసుమి! మంచిపనసపండులమెసంగు
జాణలకు మావిపండులు చవియ కావె? ॥31॥

తే. కమ్మవిల్కానిచేతిపూఁగొమ్మ ముద్దు
గుమ్మ నిద్దంపుజాళువాబొమ్మ వలపు
గ్రమ్మనిమ్మగుకపురంపుదిమ్మ సుమ్ము
కొమ్మ నెమ్మె దలిర్పఁ గైకొమ్మ లెమ్మ. ॥32॥

నీలయందలి వలపును గృష్ణుఁడు విప్రునితోఁ జెప్పుట

క. అని పంటవలఁతిజేజే
వినిపించిన నాలకించి వ్రేతలమేల్వాఁ
డెనలేనికోర్కు లెదలో
ననలెత్తఁగ నతనిఁ జూచి నగుచుం బలికెన్. ॥33॥

ఉ. ముందొకకర్జ మూని చని ముద్దులగుమ్మ నొకర్తు నక్కడం
బొందిక సేసి రాసిరులు పూన్చుచు వేమఱు వీనుదోయికి
న్విందొనరించి తౌ మిగుల నేర్పున నోబలునేలవేల్ప! మే
ల్పొందఁగ మీకుఁ జెల్లుఁగద పొల్పుగ మేల్పను లెల్లఁ గూర్పఁగన్. ॥34॥

క. చెన్నొదవెడునన్నవలాఁ
గన్నారం గన్ను లలరఁ గన్గొనియెడు మే
లెన్నఁడు గల్గునొకో యని
యెన్నెదఁ జుమ్మయ్య మిగుల నెదలో నెపుడున్. ॥35॥

సీ. కలికినెమ్మోముజాబిలిరంగు లొదవక
చెలువంపుఁగనుఁదొవల్ చెలఁగుటెట్లు?
సకియనుంగెమ్మెవిచక్కెర ల్జుఱ్ఱక
వలకాఁక పెనుదప్పి వదలుటెట్లు?
లెలనాఁగబిగికవుంగిలిజోడుఁ దొడుగక
యెద నంటుబలుతూపు లెడలుటెట్లు?
కొమ్మసింగారంపుఁగొలఁకునం దేలక
బలువిరాలపుఁవెట్ట దొలఁగుటెట్లు?
తే. మెలఁతుకలమిన్ననిద్దంపు మేల్పసిండి
గలుగకుండిన మదిలోన గాట మగుచు
నిచ్చలును హెచ్చుకలఁక నిప్పచ్చరంబు
విడుచుటెటులింకఁ బరికింపఁ బుడమివేల్ప! ॥36॥

తే. కులుకుఁబాయంపుముద్దులగుమ్మ గలుగు
సొగసుకానికిఁ దెఱగంటిచిగురుబోండ్లుఁ
బులుఁగురాచేడియలును జక్కువెలందు
కలును వీనులకంటిచెల్వలు నిఁకేల? ॥37॥

క. కన్నియలా గంతయు నిటు
విన్నప్పటినుండి తలఁపు వేఱొకపనిపైఁ
జెన్నలర దెన్ని తెఱఁగుల
నన్నెలఁతుకఁ గూర్మిఁ బెండ్లియాడెదఁ జుమ్మీ. ||38||

తే. జాళువాబొమ్మకెన యనఁజాలు వాలుఁ
గంటి నన్నన్న! కన్నులఁ గంటినేని
వలవకున్నను నీకు మేల్వాలువలిత్తు
నేలవేలుప! యిఁక వేయునేల? వినుము. ||39||

చ. అని తెలిదమ్మికంటి మదినంటి పెనంగొనుకూర్మి నాడినం
గనుఁగొని జన్నిగట్లతలకట్టపు డెంతయు నుబ్బి సామి! నీ
కనికర మింత నాపయినిఁ గల్గినఁ జాలుఁ గొఱంత యేమియం
చును వెరవొప్ప నిట్టులనుచుం బొగడంగఁ దొడంగె నద్దొరన్. ||40||

కృష్ణుని విప్రుఁడు పొగడుట

దండకం. సిరిమగఁడ! నిన్నుం దిరంబొప్ప నప్పాఁపఱేఁ డట్టి రాయంచవార్వంబుజోదైన నోరార నగ్గింపలే రన్నచోఁ బిన్న లెట్లెన్నఁగాఁ జాలువా? రెన్న నోయన్న! మున్గూళరాకాసిబల్మూకటువ ల్మోవఁగాలేక పెన్ వ్రేగునన్ లోఁగు నమ్మన్నుఁబూఁబోడికై ప్రోవులై కూడి జేజేదొరల్ వేఁడఁగా వేడబం బొప్ప నివ్వేసమిట్లూని తౌ నీవు గావించు చెయ్వు ల్నెఱిం బూని వాక్రువ్వ నెవ్వారికిం దీరు? మున్మీనుమే నూని మున్నీరు సొత్తించి ప్రాఁబల్కుముచ్చి న్వడి న్వ్రచ్చి నెత్తమ్మిపూఁజూలి నుబ్బింపవా? పెంపు రాణింపఁ దొల్వేల్పులు న్వేల్పులం గూడి పాలేఱు వేత్రచ్చుచో మేటితామేటిమై యెత్తి మవ్వంపుఁగవ్వంబుగ ట్టేపున న్వీఁపునందాల్పవా? నేలయెల్లం దగంగొంచుఁ బెంజిల్వరాటెంకికిం బాఱునాజాళువాకంటిరేద్రిమ్మరిన్ జన్నపుంబందివై క్రుమ్మవా? కన్నపట్టిన్ లలిం బట్టి కాఱించునవ్వేల్పుసూటేలికం జక్కఁగా నుక్కుఁగంబంబునం బుట్టి చక్కాడవా? గుజ్జురూపూని మూఁడంజల న్ముజ్జగంబుల్ గరంబొప్ప నాఁకట్టి చాగంపుబల్రక్కసుం గ్రిందికిం ద్రొక్కవా? గండ్రగొడ్డంట ముయ్యేడుమాఱుల్ కడుందిట్టవై గట్టిగా నేలఱేండ్లం బడంగొట్టవా? గోతికై కోఁతు లాయెల్గులుం గొల్వఁగా నుప్పుసంద్రంబుఁ బూఁదోఁటకాల్వన్వలెన్ దాఁటి చాల్పుందలల్గల్గురాకాసిఁ బోకార్పవా? దుక్కివాల్ పూని పేరుక్కునన్ రేఁగవా? మ్రాఁకులోఁ దూఱి తొల్వేల్పుఁబూఁబోండ్ల బల్నోము లొక్కుమ్మడిన్ బన్న మొందింపవా? దొడ్డగుఱ్ఱంబుపై నెక్కి యుప్పొంగుచుం దుల్వరాపాఁజులం దీర్పవా? దేవరా! నీవెకా వేలుపుంబెద్దవై తద్దయు న్నేర్పుతో నిజ్జగం బెల్లఁ బుట్టించి వెన్నుండ వై నిచ్చలు న్మచ్చికంబ్రోచి యామీఁద ముక్కంటివై తీర్తు వెల్లప్పుడు న్నీ మెయి న్నల్వగ్రుడ్డుంగము ల్మేడిపండ్లువ్వలెం బ్రోవులైయుండు నీబూటకుం బెవ్వరున్నేటుగా నారయన్లేరుగా? నిన్నుఁ బేర్కొన్నఁ గన్గొన్న నీబల్లిదంపుంగతల్ విన్న దోసంబులెల్ల న్వెసం బాయు నీమెట్టకెందామరం బుట్టి చెన్నారుమిన్నేటినీ రింత మై సోఁకఁ బున్నెంబు లెన్నేనియుం గల్గు నిన్బత్తితోఁ గొల్వఁగా లేకటాటోటులై పెక్కురిల్లాండ్రునుం బండ్లునుం బుత్తడుల్ మేడలు న్మాడలుం గోకలున్ రూకలున్ గొట్టెలు న్బట్టెలున్ మేడలు న్గోడలుం జూచి వేసారకే కాఁపురంబు ల్దిరం బంచు డెందంబుల న్నమ్మి తారూరకే మేలులంబాసి యామీఁదట న్దుంతబాబావజీరుండు గాఱింప మీఱన్ దొసంగుల్ వెసంబొంద వారిం దగం జూచి బిట్టేడ్చుచందంబులన్ రోసి యి ల్వాసి తారెల్ల చెయ్వు ల్విడంగోసి కారాకులు న్దుంపలు న్మెక్కి లోఁ జొక్కుచుం బ్రాఁతపల్కుం గొనల్సారెకుం గాంచి మే ల్దెల్వితో తోనివెల్గుం గనుంగొంచు వేమాఱు మైసోల్మి రాబారులెల్లన్దిటం బొప్పనిన్ గానఁగా నేర రెవ్వారికిం గీడు గావింపఁగానోడి యేకోర్కులు న్వీడి నీపైఁ దలం పెప్పుడు న్నిల్పి లోఁ దాల్మి దైవాఱఁగాఁ జెయ్వులేమైన నీ కప్పనంబంచుఁ బూఁట ల్వడిం ద్రోచు నాబల్లిదు ల్నీకు విందుల్గదా! నీవు కూర్మిం గనుంగొన్నచోఁ గాక నే నిన్నుఁ గొండాడఁగా నెంతవాఁడ న్నిజం బొప్ప నన్నల్వవు న్నీవె వెన్నుండవు న్నీవె ముక్కంటివి న్నీవె

జాబిల్లివిం బ్రొద్దవు న్గాడ్పవు న్నివె ప్రాఁబల్కులు న్నివె గట్టుంగముల్ వ్రాకులు న్వాఁకలు న్నివె
కా నెంచి ని న్భత్తి నే ప్రొద్దునుం గొల్చెదన్. ||41||

తే. అనుచుఁ గైవార మొనరించు నవ్వెలంతి
మన్ను వేలుపుమేల్బంతి మదికి మీఱ
వేడ్క లొనగూర్చి పనిచి యవ్వెన్నముచ్చు
చెలువచెలువంబె పలుమఱుఁ దలఁచుచుండె. ||42||

కాలనేమికొడుకు లాఁబోతులై పుట్టి జగములను గాసిఁ బెట్టుట

సీ. అంతట మిథిలలో నలకుంభకునియింట
మును కాలనేమికి ననుఁగుఁగొడుకు
లగుతుల్వరక్కసు లాఱునొక్కరు దొడ్డ
యాఁబోతు లై పుట్టి రచ్చెరువుగ
జుట్టువాల్దాలుపుసూడు లెంతయుఁ గ్రొవ్వి
యెనలేనిలావున నెల్లకడల
మెలఁగుచు ససినెల్ల మేయుచుఁ గోడలు
వెలుగులు పెండెము ల్వ్రేఁగుఁద్రొక్కి
తే. దొడ్డిపట్టుల నిల్వక త్రోవ నెవరి
నెదిరికొమ్ములఁ గ్రుమ్ముచుఁ గదిసి కోడె
తఱపులను బొడ్చుచును వడిఁ దవిలి ఱంకె
లిడుచుఁ బొగరెక్కి యుక్కున నడరి రెలమి. ||43||

క. బెబ్బులులనైన మార్కొను
నబ్బురపుం జేవ గలిగి యాసతగిబ్బల్
నిబ్బరముగ నాఁడెంపుం
గుబ్బలు లిటు లయ్యె నేమొకో యన నలరున్. ||44||

ఆఁబోతులయుపద్రవమును బ్రజలు రాజుతోఁ జెప్పుట

క. చెలరేఁగి యిట్టు లెల్లెడఁ
గలయం ద్రిమ్మరుచుఁ జాల గాసి యొనర్పం
దలఁకి పజ లెల్ల నపు డ
గ్గల మగుకడగండ్లఁ జిక్కి గములై సరగన్. ||45||

తే. పనసపండులు దబ్బపం డ్లనఁటిపండు
లీడపండులు టెంకాయ లిప్పపూలు
చెఱకుఁగోలలు దేనియ ల్గఱుచుగాను
గొనుచుఁ బఱతెంచి రెకిమీనికొలువునకును. ||46||

తే. అరిగి మెల్లన గవనికాపరులచేత
నేలకకుఁ దమరాకడ యెఱుఁగ జెప్పి
యతనియానతిఁ గైకొని వెతలు మఱచి
నగుచు నందఱు గొబ్బున నగరుసొచ్చి. ||47||

సీ. మగమానికములక్రొన్నిగనికల్ దులకింప
బలుతమ్మికెంపుమే ల్పసలు నింప

రేరాచఱాచాయ క్రేవల నలరంగఁ
బులుఁగుఱాపచ్చరంగులు పొసంగఁ
గఱిరతనంపుఁ జొక్కపుసిరు ల్దళుకొత్తఁ
బగడంపుగుంపు కెంజిగి యొనర్పఁ
దెలిక్రొత్తముత్తియంబులడా ల్దువాళింప
వెలుఁగురాఱాహొరంగులు వెలుంగ
తే. మఱియుఁ బే రగునాఁడెంపుమానికంపు
గముల నిద్దంపునన్నియ ల్గడలుకొనఁగ
నందముల కెల్ల నుర్కిప ట్టనఁగఁ జాలు
మేలిపని నొప్పుజాళువామేడలోన. ||48||

తే. దొరలు మన్నీలు చెలులు బందుగులు జెట్లు
బంట్లు కబ్బంపుఁగూర్పరు ల్పాళెగాండ్రు
గడనచేడియ లూడిగల్ గాణ లొజ్జ
బాఁపనయ్యలు దీర్పరుల్ బలసి కొలువ. ||49||

సీ. బంగారుఁదగటుదుప్పటిచెఱంగులరంగు
మేచాయ కొకక్రొత్తమెఱుఁగు చూప
బలుముత్తియపుఁజౌకటులడాలు నిద్దంపు
బవిరిగడ్డముమీఁదఁ జవుకళింప
బూపవెన్నెలఱేనిఁ బోలునెన్నొసలిపై
జిలుఁగుఁగస్తురిబొట్టు చెలువు మీఱ
సొగసుగా విరిసరుల్ చుట్టి గట్టిగ నిడ్డ
సిగ పెంపనాఁడెంపు సిరుల నీన
తే. గొప్పరతనంపుఁబలకము ల్గొలుసులుంగ
రములు మురువులు సింగార మమరఁబూని
వేడ్క లిగురొత్త రెండవ వేల్పుఱేని
కరణి గొలువున్నదొరఁ బొడగాంచి యపుడు. ||50||

తే. తమరు గొని చన్నసరకు లెంతయునుబత్తి
నప్పనము సేసి మిగుల జోహారు లొసఁగి
కేల్గవలు మోడ్చుకొని యొకక్రేవ నిలిచి
యెదలఁ గొంకుచు వా క్రుచ్చి రిట్టు లనుచు. ||51||

క. దేవర! నీ వీపజలను
బ్రోవగ నిన్నాళ్ళదాఁకఁ బొదలుచు మేమున్
ఠీవి దలిర్పఁగ నెదలో
నేవెఱపును లేక యుంటి మెడలనికడిమిన్. ||52||

క. ఇప్పుడు నిదె యచ్చెరువై
చెప్పంగా రానిదొడ్డ చే టొనగూడెం
దప్పక యాలింపుము నీ
విప్పట్టునఁ గినుక లేక యెలమి దలిర్పన్. ||53||

ఉ. గొల్లలనాయఁడై పరఁగు కుంభకుమంద న దేమివింతయో
కల్లరిగిబ్బ లేడు పొడ గట్టి పజం గడు గాసిఁ బెట్టుచుం

గొల్లగ నెల్లపైరులను గొంకును జంకును లేక మేయఁగాఁ
దల్లడ మంది వచ్చితిమి తద్దయు మీకిది దెల్పుకోరికన్. ‖54‖

క. గిబ్బ లవి కాఁపువారల
గొబ్బున నొకముద్దఁ జేసికొని మ్రింగుఁజుమీ
దబ్బఱలుగఁ జూడకు మో
యబ్బా బెబ్బులులకైన నటు జంకుదుమే? ‖55‖

క. చలపొడిచి ఱంకె లిడుచును
జలుమఱు ముంగాళ్ళఁ ద్రవ్వి బలువిడిఁ బసికాఁ
పులఁ గ్రుమ్మివిడుచుఁ బైకొని
పొలమంతయు నవియె యగుచుఁ బొగరు సెలంగన్. ‖56‖

తే. ఆకుఁదోఁటలు నుగ్గాడి యరఁటితోఁట
లెల్ల మల్లడిగొనఁ ద్రొక్కి యుల్లికంద
పసుపుఁదోఁటలు జంగిలి కసవుబీళ్ళు
చెఱకుఁదోఁటలు పండినచేలుఁ దీర్చె. ‖57‖

క. ఓరాయఁడ యీయంగద
కోరువలే కిటకు వచ్చె నూళ్ళన్నియు మే
మూరక దబ్బఱలాడఁగ
నేరము నూఱార్లకయిన నీయాన సుమీ. ‖58‖

ఆఁబోతులఁ బట్టింపు మని రాజు కుంభకున కాజ్ఞాపించుట

చ. అన విని నెలఱేఁడు వెఱఁగందుచు వారల నూఱడించి యి
ప్పని సవరింతుఁ బొండనుచుఁ బంపి యెదం గడుఁగిన్క మీఱ గొ
ల్లని బిలిపించి నీవు పదిలంబుగఁ గోడెలఁ బట్టకున్న నా
మునఁ దనరారుచున్ మొదలుముట్టఁగ మేయును బైరులన్నియున్. ‖59‖

క. గట్టిగ నీ విఁక వానిం
జట్టింపుము గాక యున్నఁ బంటింపక పెం
గట్టడవి కయిన వెడలం
గొట్టింపుము చేయవేనిఁ గొఱగాదు సుమీ. ‖60‖

క. బలుసిరి గలుగుట కొరులం
గలఁచుట యెవ్వారి కయినఁ గటకట తగునే?
బలిమి గలవాఁడ వగునీ
కలగిబ్బలఁ బట్టరాదె యాఱడి మేలే? ‖61‖

తే. అనుచు నొడయఁడు నుడివిన విని యతండు
తలఁకి యోతండ్రి యాకోడియలను బట్టి
గట్టిచేసెద నిఁక నింత కసరవలవ
దంచుఁ గడు వేఁడుకొని యింటి కరిగె నపుడు. ‖62‖

ఆఁబోతులను బట్టం బూని గొల్లలు భంగపడుట

క. తనచుట్టంబుల నందఱి
బనివడ రావించి తేనిపలుకులు దెలియన్
వినిపించి గిబ్బలను గొ
బ్బునఁ బట్టఁగవలయు నంచుఁ బురికొల్పుటయున్. ||63||

తే. గొల్ల లెల్లను బెల్లుగ వల్లియలును
బల్లిదపులంజెపలువులు మొల్లముగను
బూని యమ్మేటిపొగరుటాఁబోతుతుటుము
బలిమి మెఱయంగ డాకొని పట్టఁ దొడఁగి. ||64||

క. వలత్రాళ్ళు వైచి యయ్యెడఁ
బలుమాఱును దఱిమి యురులు వన్ని కడున్ దొ
డ్డలు నాఁగి మోది యోదం
బులు ద్రవ్వియుఁ బెక్కుచందములఁ బెనఁగునెడన్. ||65||

సీ. వలపగ్గములు ద్రెంచి కలఁబడఁ గొందఱి
బొజ్జలు వ్రయ్యంగఁ బొడిచి పొడిచి
యెగసి చెంగుల దాఁటి పొగరునఁ గొందఱి
డొక్కలు నలియంగఁ ద్రొక్కి త్రొక్కి
తొడరి పట్టఁగఁ బోవఁ దొడఁగినఁ గొందఱిఁ
దలల నెత్తురు లుర్లఁ దాఁచి తాఁచి
కెరలి పేరెమువాఱి యురవడిఁ గొందఱిఁ
దుమురుగాఁ బుడమిపైఁ ద్రోచి త్రోచి
తే. గబ్బితనమున హెచ్చి య గ్గిబ్బకదుపు
నిబ్బరంబుగఁ బట్టంగ నబ్బకున్న
జబ్బుపడి యందఱును గడు నబ్బురముగ
బొబ్బ లిడుకొంచుఁ బాఱిరిఁ బ్రోలిదరికి. ||66||

క. అటువలె బలియురు పెక్కం
డ్రటమటమైఁ జన్న విన్న నగుచున్ మిగులన్
దిటము చెడి గొల్లనాయఁడు
కటకటఁ బడి యింక నెద్ది కర్జం బనుచున్. ||67||

ఆఁబోతులం బట్టినవానికి నీల నిచ్చునట్లు కుంభకుఁడు చాటించుట

తే. కొంతతడ వెంతయును మదిఁ గుంది యొడయఁ
డేమి గావించునో యిఁక నెట్టు లతని
మ్రోలఁ దెల్పుదు నీయాముటాలపోతుఁ
బిండు నెవ్వాఁడు గెల్వఁగలండు పూని. ||68||

తే. తడయఁ బనియేమి మినుసిగదయ్య మింక
నెట్టు గావింపనున్నాఁడొ యెవ్వఁ డెఱుఁగు
నబ్బురం బొప్ప నిత్తఱి నహహ యెట్టి
కీడునకుఁ బుట్టెనో యిట్టిగిబ్బ లేడు. ||69||

క. అని యెందు వెరవు దోఁపక
పనివడి యిక్కోడియలను బట్టఁగఁ గలజా
ణని కిచ్చెద నీకన్నియ
నని యెల్లెడలందుఁ జాట ననిచెన్ సరగన్. ॥70॥

తండ్రి చాటించుటను విని నీల చింతించుట

క. అటులఁ దనతండ్రి చాటిం
చుట చెలికత్తియలవలనఁ జొప్పడ విని మి
క్కువ మగువంతలఁ గుందుచు
దిట వింతయు లేక నీల దిగు లెదఁ బొదువన్. ॥71॥

ఉ. అక్కట! తండ్రియేల మరునయ్యకుఁ బెండ్లి యొనర్తునంచుఁ బె
న్మక్కువనుండుచో దెఱఁగుమాలినటక్కరియాలపోతులి
ట్లెక్కడనుండు కల్గె? నిపు డెవ్వరు నెవ్వగఁ దీర్చువార ల
మ్మక్క! హులిక్కియాసననయంబు మది న్వెతఁ జెందనాయెఁగా. ॥72॥

క. ఇత్తెఱఁ గంతయు నిపుడా
పుత్తడిదువ్వలువతాలుపున కెవ్వారల్
బత్తి నెఱిఁగించి యెదలో
దత్తఱ మంతయును దీర్పఁ దగియెడువారల్? ॥73॥

తే. వెన్నుఁ డాట వీనుల విన్నయపుడె
వచ్చునో లేక యీపని కిచ్చ యిడఁడొ
వచ్చి గిబ్బలఁ గూల్చునో వానివలన
వీఁగి యేఁగునొ యిఁక నెద్ది వెరవు గలదు? ॥74॥

తే. సోఁకుమూఁకలగొంగ యిచ్చోటి కెమ్మె
లూర గొబ్బున వేంచేయ కుండెనేనిఁ
జెల్లబో యింక నెటువంటి చెనఁటిగొల్ల
చెట్టఁబట్టం దయ్యంబుఁ జేయునొక్కొ. ॥75॥

సీ. దట్టంపుమిన్నాఁకతరఁగచాల్పునఁ దేలు
తెలిపుల్గు బురదగోతులకుఁ జనునె?
పుడుకుమ్రాన్వలితావిపువ్వుఁదేనియ లాను
మగతేఁటి తుమ్మకొమ్మలకుఁ జనునె?
తొలుమొగుళ్ళుడుచిన్కు లెలమిఁ గ్రోల్వానకో
యిల బలుమంచుసోనలకుఁ జనునె?
పరువంపుఁ గ్రొమ్మావిపండు లేపున మెక్కు
చిలుక గాటపుటుమ్మెతలకుఁ జనునె?
తే. పక్కిరాజక్కిదొరచెల్మిఁ జక్కఁ గోరి
చొక్కుచుండెడుడెంద మమ్మక్క యొక్క
తులువమానిసితోడఁ బొందునకు నిచ్చ
యిడఁగఁ జూచునె తలఁప నెయ్యెడలనైన? ॥76॥

తే. పుడమిలోపల మగవాఁడు పూని తనకుఁ
గోర్కి యగుకల్వకంటిఁ గైకొనుచునుండు

నహహ! తమమది కిచ్చయౌనట్లు మెలఁగఁ
గన్నియల కేమిటికి బల్మి గలుగదయ్యో? ॥77॥

సీ. వ్రేపల్లెనుండి మున్నేపుతో నిచటికి
నేలవేలుపుఁబెద్ద యేల వచ్చె?
వచ్చి మచ్చికమీఱ హెచ్చుగా హొంబట్టు
సాలుదాలుపుఁగత లేల తెలిపెఁ?
దెలిపినఁ దండ్రి యచ్చెలువున కీజవ
రాలి నిచ్చెద నని యేల పలికెఁ?
బలికినమాట యేర్పాటుగా విని తన
యెదఁ గూర్మి యతనిపై నేల పొడమెఁ?
తే. బొడమెఁగాకేమి పొగరుటాఁబోతు లేడు
నిత్తెఱంగున దొడ్డిలో నేల కలిగెఁ
గలుగుటకు నేలతేఁడేల కాఁకసేసె?
నయ్యయో! దయ్యము నిఁకేమి యనఁగఁ గలదు? ॥78॥

తే. చిలుకవార్వంపుమేటివజీరుఁ గేరు
నాలకాపరిసోయగం బనువుమీఱఁ
దలఁచినపుడేమొకాని డెందమున దిగులు
పాయఁగానేర దిఁక నేమి సేయుదాన? ॥79॥

క. ఇప్పని దలిదండ్రులకుం
జెప్పఁగవలె నంచుఁ దలఁప సిబ్బితి మిగులన్
ముప్పిరిగొనుచుం బైపయిఁ
గప్ప నొరులచాటువారు గారే కన్నెల్? ॥80॥

చ. వలనుగ మేలుగీళ్ళు గుడువం దగువారని నమ్మి యెంతయుం
జెలిమి దలిర్ప నిత్తెఱఁగుఁ జెప్పఁగఁ జూచిన సారెసారెకుం
గిలకిలలాడుచు న్నగులఁగేకలు గొట్టుదు రింతె కాని చి
క్కులు సడలించి మేలుపనిఁ గూర్పఁగ నేర్తురె రాచనెచ్చెలుల్? ॥81॥

తే. అలర వలమురితాలుపుచెలిమి తనకుఁ
గలుగకుండిన వేఱొకతులువ నింక
వలవ నెవరేమి చేసినఁ దలఁక నంచు
నంతకంతకు నగ్గలం బైనతమిని. ॥82॥

నీల మన్మథావస్థలం బడుట

సీ. కనుదోయికెలఁకులఁ గ్రమ్ముపెన్నీటిజా
ల్బలితంపుగబ్బిగుబ్బలను ముంప
సుడివోనివేఁడినిట్టూర్పుగాడుపుల బ
ల్వడలఁ గెంజిగిమోవి వాడువాఱ
వెడవిలుకాఁడు బల్విడి నించుపూవంప
జల్లుపెల్లున మేను దల్లడిల్ల
దట్టంపువలపులఁ దమి బెండుకొని సారె
సారెకు గుండియ జల్లనంగఁ
తే. దాళఁజాలక మదిలోనఁ దగులుబాళిఁ

గూలి సోలుచుఁ జాల విరాళిఁ దేలి
తేలి నెచ్చెలిబారుఁ బోఁదోలి మేలి
పూలపానుపుపై వ్రాలి వాలుఁగంటి. ॥83॥

క. ఉసురసు రనుచుం బొరలును
గసరును బస దఱిఁగి వెసను గడగడ వడఁకు
న్విసువున బుసవెట్టును వె
క్కస మగు వలరాచసెగలఁ గ్రాఁగుచు మఱియున్. ॥84॥

సీ. తలయూఁచుఁ దనలోనఁ దాన నవ్వుఁ గలంగుఁ
గలవరించును బయల్ గౌఁగిలించుఁబిలువ
బిలువకే పలుకుఁ గన్నులు మూయుఁ జెక్కిట
గైసేర్చు బెదరు నల్గడలు వెదకు
వలిగాడ్పు దూఱు నంచలఁ దోలు దయ్యంబుఁ
దిట్టు మైతొడవులఁ దీసి వైచు
బోటులఁ గసరు గొబ్బున లేచి చిల్కల
నడుచుఁ బల్మఱుఁ గొప్పు విడిచి ముడుచు
తే. నళుకుఁ జిడిముడిపడి సొమ్మసిలు దిటమ్ము
లేక కన్నీరు నించు సళించు నోకి
లించుఁ బిమ్మట గొను దత్తఱించుఁ జాల
నలరువిలుదాల్పుతండ్రిపైఁ దలఁపు నిలిపి. ॥85॥

చెలికత్తెలు నీలకు బుద్ధులు చెప్పుట

క. అట్టియెడఁ జెలిమికత్తియ
లట్టియలుగఁ గూడి చేడియం గని యని రీ
బెట్టిదపువగలఁ బొగులుచుఁ
గట్టా నీ విట్లు డయ్యఁగాఁ దగునె చెలీ! ॥86॥

తే. కన్నియవుగాని ప్రోడవు గావు నీవు
పువ్వుఁబోఁడిరొ సిగ్గెల్లఁ బోవ నడిచి
బలుదొసంగులఁ బొరలఁగఁ బాడె నీకు
నించుకేనియు మదిలోన నెంచ వకట! ॥87॥

సీ. అద్దంబు గని తద్ద నిద్దంపుఁగస్తురి
ముద్దునెన్నొసలిపై దిద్దవేమి?
కుప్పలై కప్పున నొప్పారుపెన్నెఱు
లింపుగా దువ్వి పాటింపవేమి?
యెమ్మె నిమ్ముగ మానికమ్ములసొమ్ము లం
దమ్ముగా నెమ్మేనఁ దాల్పవేమి?
పెట్టెఁ బెట్టినయట్టిజట్టిమీఱినపట్టుఁ
బుట్టముల్ మట్టుఁగాఁ గట్టవేమి?
తే. కోరి యోరిమి నోరెంబు గుడువవేమి?
తొడర వలిదావివిరిసరుల్ ముడువవేమి?
నునుపుదళుకొత్తఁ బలుకులు నుడువవేమి?
చామ! నీకిది యెటువంటిజాడ చెపుమ? ॥88॥

క. పలుతెఱఁగులఁ గలఁగుచు నిటు
వలెఁ గొదుకఁగ నేల? లాఁతివారమె నీకుం?
దలఁపునఁ గలపనియెల్లను
దెలుపవె మాతోడఁ బలికి దిటముగఁ గలికీ! ॥89॥

క. తగులమునఁ దగిలి నీ వీ
పగిది న్బిగి తఱిఁగి రేయుఁ బవలు న్మిగుల
న్వగలం బొగులఁగఁ దగవా?
మగువా! నగువారి నెట్లు మదిఁ దలఁపవయో! ॥90॥

సీ. చిలుకబోదల మచ్చికలు చేసి ముద్దులు
చిలుకఁ బద్దియములు చెప్పరాదె?
తెలిపిట్టగమిఁ జేరఁదీసి తద్దయు బుద్ధి
దెలిసి మెల్లన నడల్ దీర్పరాదె?
నెమ్మికూటువుల గాటమ్ముగాఁ గూరిచి
నెమ్మితో నాటలు నేర్పరాదె?
బట్టికాఁడుల నింపు పుట్టునట్టుగఁ గేలఁ
బట్టి పాటలఁ గఱపంగరాదె?
తే. చెలఁగి పూఁదీవియలఁ బ్రోది సేయరాదె?
మేలిరతనంపువీణియ మీటరాదె?
నలువుగా నెచ్చెలులఁ గూడి నవ్వరాదె?
కలికి! నీడెందమునఁ జిక్కునులుకుమాని. ॥91॥

చ. కులుకుచుఁ జేరి యాటలకుఁ గూరిమినెచ్చెలు లెచ్చరించినం
బలుకవదేమి? యేమఱక పజ్జల నిల్చినయూడిగంపుటిం
తులఁ గని తద్దయుం గినుకతో నదలించెదవేమి వేమఱుం
జిలుకలకొల్కి! నీవెడఁగుఁజిన్నియ లెన్నఁగఁ గ్రొత్తలిత్తఱిన్. ॥92॥

క. లేమా! నీవెత మానుప
లేమా మోమోటమున సళింపఁగ డేపుని
లే? మాఱుమాట యొసఁగుము
వేమాఱును దలఁక నేల వేదుఱు మీఱన్? ॥93॥

తే. బేల! యీబేరజపుఁదనం బేల? యింక
నాన యింతయు మదిలోన నానఁబోక
నిచ్చలం బొప్ప మాతోడ నిచ్చయైన
దెల్ల నెఱిఁగింపు మెంతయుఁ దెల్లముగను. ॥94॥

క. అని యనుఁగుంజెలు లిత్తెఱఁ
గునఁ బల్కిన నాలకించి కోమలి మిగులం
దనడెందంబునఁ గోరిక
లినుమడియై నెగడ వారి కిట్లని పలికెన్. ॥95॥

చెలికత్తెలతో నీల తనతలఁపుఁ దెల్పుట

తే. వినుఁడు చెలులార! నామాట నెనరుమీఱఁ
దలఁపులోవార లౌ మీకు దాఁపనేల?

డెంద మంతయుఁ గఱివేల్పునందుఁ దగిలి
మరలఁగానేర దిఁక నెద్దివెరవు చెపుఁడ. ॥96॥

ఉ. చక్కెరవింటిజోదు నెకసక్కెములాడఁగఁ జాలుపక్కిరా
జక్కివజీరుచెల్వు చెవిఁ జక్కఁగ నాటిననాఁటనుండి య
మ్మక్క! యదేమొ కాని యెద నంటినకూరిమి యంతకంతకున్
వెక్కసమై పెనంగొనుచు వేమఱుఁ బాయ దిఁకేమి సేయుదున్? ॥97॥

ఆ. మిన్నజన్నిగట్టుగ్రొన్నెల వెన్నుని
చెన్నుమీఱ నప్పు డెన్న మున్న
విన్నకతన నెపుడుఁ గన్నులఁ గట్టిన
ట్లున్న దెడము లేక యన్నులార! ॥98॥

తే. తప్పులెన్నక మొదలినేస్తంబుఁ దలఁచి
యిప్పు డిప్పని యొనగూర్చుఁ డొప్పుమీఱ
మీర లొనరించునట్టియమ్మేలు మఱచు
దానఁ గానుజుఁడీ యెందు జాణలార! ॥99॥

క. అనుచుఁ గడలేనియంగద
గనఁబడ నప్పడఁతి వేఁడికన్నీ రొలుకం
దనతెఱఁ గెఱిఁగించిన విని
యనుగుంజెలు లెల్ల దాని కని రిట్లనుచున్. ॥100॥

చెలికత్తెలు నీల నెగ్గులాడుట

క. కన్నియరొ! యంతపని కయి
వన్నెయు వాసియును దఱిఁగి వగచెద వకటా!
నిన్నేమి యనఁగ గల? మీ
మున్నరికలు వినుట లేదు మున్నెచ్చోటన్. ॥101॥

క. లిబ్బులచెలిపెనిమిటిపై
నబ్బురపున్వలపు నిలిపి యలమట మీఱన్
సిబ్బితి విడిచెదు నీకున్
గబ్బితనం బిట్టు లేల కలిగెనె పొలఁతీ! ॥102॥

చ. కడఁక యొకింత లేనివలకాఁకలఁ గ్రాఁగుదు లోగి ఱాఁగవై
చిడిముడిపాటుతోఁ జెలులఁ జెంతలఁ జేరఁగ నీక తద్దయున్
గడుసుఁదనంబుఁ బూని సరిగన్నియ లందఱు నవ్వ నయ్యయో
యడఁకువ లి యిప్పగిది నాడఁగఁ జెల్లునె ముద్దుఁగన్నెకున్? ॥103॥

సీ. తెలిదమ్మికంటి యిప్పలుకు విన్నంతనే
కడలేని వేడ్క నిక్కడకు వచ్చు
వచ్చి యచ్చెరువుగా రెచ్చి పాతెడుగిబ్బ
పిండు నొక్కుమ్మడిఁ జెండివైచు
వైచి పెంగూర్మి చొప్పడ నెన్నఁగారాని
పేర్మితో ని న్నిందుఁ బెండ్లియాడు

నాడి నాఁడెపుఁబైఁడియందలంబున నిల్పు
కొని తనపల్లియ కొనర నరుగు

తే. నరిగి రతనంపు మేటియుప్పరిగలోనఁ
జెలువు మీఱినగొజ్జెఁగసెజ్జమీఁదఁ
బలుదెఱంగుల వలరాచపనుల నిన్ను
మెఱయఁ గరగించు నమ్మమీ మెఱుఁగుఁబోఁడి. ||104||

క. ముద్దులపట్టివి నీకీ
గద్దఱిచందముల మెలఁగఁగా రాదు సుమీ
తద్దయుఁ బెద్దలఁ దలఁపక
ముద్దియ నీ కింత డెందమున వెత యున్నే? ||105||

ఆ. కొలఁదిలేనివేడుకల మును పెంచిన
యంచచిలుకగముల నలుకమీఱఁ
చొడర నడిచి పాఱఁదోలెద వివియేమి
తప్పు సేసె నిపుడు తలిరుఁబోఁడి. ||106||

తే. అతివ! యెన్నఁడు మామాట కడుగుదాఁట
కుండుదానవు నేఁడేమి యొండుదెఱఁగు
పూని మాటికి నుడువంగరానికినుక
సేసెదవు నేర మెద్ది మాచెంతఁ జెపుమ. ||107||

క. ఎలనాఁగరొ! నీకోరిక
వలనుగఁ జేకూరె నింతవలవంతయుఁ దా
నిలుచును మాపైఁ బలుమఱు
నలుక కడు న్నిగుడ నెగ్గులాడకు మింకన్. ||108||

వ. అనిన విని ముద్దియ తద్దయుం బ్రొద్దూరకుండి యన్నెచ్చెలిపిండునకు వెండియు నిట్లనియె. ||109||

నీల చెలికత్తెలపైన నలిగి మాటలాడుట

ఉ. మమ్మర మైనబల్వెతల మున్గుచునుండెడుదానిచుట్టునుం
గ్రమ్మి పడంతులార! కొఱగాములు వేమఱు నెంచ సాగినా
రమ్మకచెల్ల! యల్ల చిగురాకుఁగటారికడిందిజోదుపూ
వమ్ములబారి కోర్వఁదరమా పెఱమాటలు వేయు నేటికిన్? ||110||

క. కడనుండి పెక్కుమాటలు
నుడువంగా వచ్చుఁగాక నూల్కొనియెడుపల్
కడగండ్లఁ బడఁగ వచ్చునె?
విడువక యెవ్వారికైన వెలఁదుకలారా! ||111||

క. అకటా! బెడిదపువలపుల
సెకలం బడి వ్రేఁగుదానిఁ జేపట్టఁగనొ
ల్లక యిటువలె నెంతురె ని
ప్పుకలపయిన్నేయి చల్లుపోలిక మీఱన్? ||112||

తే. వినుఁడు నామాట లిపుడు మీవీనులలర
సైఁపకుండిన నింతియ చాలుఁగాని
యింకనేమియుఁ గొఱగానియెగ్గులాడఁ
బోకుఁడీ మీకు మ్రొక్కెద బోటులార. ||113||

ఉ. కూరిమిబోటులంచు మిముఁ గొండగ నచ్చుచు నున్నచో నయో
నేరము లెన్నుచు న్మిగుల నెవ్వగలం గలఁగించి సారెకుం
గేరెద రింతెగాని మదికిం గడు నెమ్మి దలిర్ప నేర్పుతోఁ
గోరినకోర్కి మీఱ సమకూర్చఁగఁ జాలుదురే యొకింతయున్. ||114||

ఉ. చక్కఁదనంబు జవ్వనము జాణతనంబు గొనంబు దేజుఁ బెం
పెక్కినయుక్కునున్ సిరియు నిమ్ముగఁ గల్గి చెలంగుచున్న యా
రక్కసిగొంగపైఁ గడుఁదిరంబుగ నిల్పినడెంద మింకఁ దాఁ
డక్కరి నొక్కనిం గవయుట న్నెఱిఁ గోరునె మాట లేటికిన్? ||115||

క. మీమాట సేయదని యిం
కేమియు నుల్లమున నలుక లిడఁబోవక మీ
గీములకుఁ బొందు గొబ్బున
వేమాఱును గేలు మొగిచి వేఁడెద మిమ్మున్. ||116||

చ. గొనకొని మీయెడన నెఱయఁ గూఱిమి డెందములోనికస్తిమం
తనమునఁ దెల్ప నేరుపులె తద్దయుఁ జూపితి నింతె యందఱున్
వినియెడునట్లుగా నిఁకను వేమఱు నామున నవ్వుకొంచు నో
యనుఁగవెలందులార! మము నాఱడిఁ బెట్టకుఁ డమ్మ వేఁడెదన్. ||117||

వ. అని యిత్తెఱంగునఁ నమ్మెఱుంగుఁబోఁడి బిత్తరించుచుం గ్రొత్తవలవంతలఁ దత్తఱించుచుఁ బుత్తడిదువ్వలువదాలుపు పయినత్తినబత్తిం జెలికత్తియలమొత్తంబుల నొత్తియాడుచు నీడులేనికోర్కుల నువ్విళ్ళూరుచుండెనని నిరాబారిసింగంబులకు గతయెఱింగించుజడదారి వినిపించిన వార లతని నవ్వలికతయుఁ దెలుపుమని వేఁడిన. ||118||

మ. మలసూడగ్గి జముండు రక్కసుఁడు నీర్మైతాల్పురాగాడ్పుజ
క్కులఱేండ్లు న్విసదారితాలుపును బల్కుంబోటిగేస్తుండుఁ బు
ల్గులరాడాల్దొరయు న్మొదల్గలుగువేల్పు ల్గొల్వ నవ్వెండిగు
బ్బలిపైనుండి జగంబులేలుబలువేల్పా! గట్టువిల్దాలుపా! ||119||

తే. కడలిదొన పాఁపనారియుఁ బుడమితేరు
గట్టువిల్లును దొలిపల్కుగమిగుఱాలుఁ
బులుఁగుడాల్వేల్పుములిఁకియుఁ బూని కడిమి
మెఱయఁ దిగప్రోళ్ళుగూల్చినమేటివేల్ప. ||120||

మాలిని. కదలనిబలుతేరున్ గాడుపున్ మేయుపేరుం
గుదు రగుతలయేఱుం గొండపై మేల్బిడారుం
గొదుకక పలుమాఱుం గోరికల్ గూర్చుతీరుం
బొదలెడిమెయిసొరుం బూని యొప్పారుమేటీ! ||121||

గద్యము. ఇది శ్రీమదుమారమణ కరుణాకటాక్షనిరీక్షణ సంలబ్ధసరసకవితా సామ్రాజ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచి గంగనామాత్యపుత్త్ర బుధజనవిధేయ

తిమ్మయనామధేయప్రణీతం బైననిలాసుందరిపరిణయం బను నచ్చతెనుఁగుఁ బ్రబంధంబునందు ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము

క. సిరిపెనిమిటియుం బలుకుల
గరితమగఁడుఁ బొగడ మెచ్చుగాంచినగట్టుం
దొరముద్దుఁబట్టిడెందపు
విరిదమ్ముకొలంకుఁదేటి! వేల్పులమేటీ! ‖1‖

వ. విను మన్నిరాబారిరాబారులకుం గత యెఱిఁగించుజడదారి యిట్లని చెప్పందొడంగె నట్లు గొల్లరాకన్నియ వన్నియ దఱిఁగి యెన్నరానివగలం బొగులుచున్నంత. ‖2‖

సాయంకాలవర్ణనము

తే. బొమ్మ యనుపేరియగసాలె పూఁటచెలిని
గోరి యలరించుటకుఁ జదల్గుదుటఁ గాఁచి
నీటముంచిన మేటివన్నియపసిండి
పూదెయనఁ గ్రుంకుఁగడలిలోఁ బ్రొద్దు వ్రాలె. ‖3‖

తే. రేవెలందుకఁ బెండ్లాడ రిక్కరాయఁ
డేఁగుదేఁగలఁడని వేల్పుటిగురుఁబోండ్ల
గములు గట్టినక్రొత్తచెంగలువకోక
గములనఁగ సంజకెంజాయ లమరె మింట. ‖4‖

క. బలితంపుసంజకెంజా
యలు నిద్దపుమావిచిగురులని చేరి తమిం
గలయంగాఁ బర్విరికో
యిలమూఁక లనంగఁ గడల నిరులు దనర్చెన్. ‖5‖

క. మరుఁడు దెరువరుల నెల్ల
న్వైరపునఁ దీర్పంగఁ గోరి విరివిగఁ గఱిదే
వరంయడుగున నిడుమల్లియ
విరు లనఁగా రిక్క లెసఁగె వేలుపుఁద్రోవన్. ‖6‖

క. తామరలు ముడిఁగె జక్కవ
చామలకు న్వెతలు పర్వెఁ జక్కగఁ బడుపుం
గోమలులకు బొజుఁగులకును
సేమం బొనగూడె నపుడు చెప్పఁగ నరుదై. ‖7‖

చంద్రికావర్ణనము

తే. తనర మగమానికపువాలుదాల్పుజోదు
వేడుకలు మీఱ నాడుమేల్మేడమీఁద
గొనబుమీఱెడు నపరంజికుండ యనఁగఁ
దూర్పుగుబ్బలిపైఁ దోఁచెఁ దొగలఱేఁడు. ‖8‖

క. మినుఁగొలకునఁ బూచినచ
క్కనిచెందొవ యనఁగఁ దనరెఁ గలువలదొరలోఁ
గననయ్యెఁ గప్పు మది క
త్తినవేడుక నుండుగండుఁదేఁటి యనంగన్. ||9||

వ. అంతఁ గొఱంత యింత లేక జగం బంతయు నిండి పిండిచల్లినతెఱంగునఁ బొంగారుచు దెఱపి లేక తఱపివెన్నెలలు గాయఁదొడంగినం గడంగి నింగిముట్టిన సంతసపుటగ్గలికల డగ్గరించి యొక్కుమ్మడిఁ బొక్కుచు గ్రక్కునమెక్కియామెక్కి యక్కజంపుమక్కువలం జొక్కి చిక్కక చక్కెరవిలుదాల్పు బవరంబులం దవిలి చెన్నారు వెన్నెలపులుఁగులమొత్తంబులును వెన్నెలపులుఁగులమొత్తంబుల బిత్తరంపుంబనులకు మెత్తఁబడి క్రొత్తవగఁ దత్తఱించుచుం దమతమవేడ్కకత్తెల నత్తుకొని పూవుటెత్తులవ్రేటులాడుచు విచ్చలవిడిం దిరుగు బొజుంగులును బొజుంగుల నొక్కెడకుం బనిచి వగలం దగిలి మగల నెదిరించి కొంచక మంచిగందంబు లలఁది వలిపంపుఁదెలివలువలు ముసుంగు లిడి దొసంగు లఱి వెసం గదలి యిక్కలకుం దాఱు చెడిపజవరాండ్రం గని తమజవరాండ్ర నెదలం దలంచి యొల్లన నుల్లంబులు దల్లడిల్ల నుస్సురని సొమ్మసిలం బాఱుతెరువరులును దెరువరుల గెలువం దరలు మరునకు దఱియసుకమ్మరీఁడు వెరవునం జేసి యునిచిన కఱకుటమ్ములగుంపుల సొంపునం బెంపాఱు కలువక్రొవ్విరులును గలువక్రొవ్విరులపయి మూసరి కొసరి తీఁగపసగలపూదేనె లాని పెల్లుగం ద్రుళ్ళు గండుఁదుమ్మెదలును గండుఁదుమ్మెదలరొదలు చెవుల నాట బీఁటలగుడెందంబులతోడ గాటంపుమరునాటలకుఁ దివురు కొమరుబాయంపుందుటారికత్తియలును తుటారికత్తియలసిబ్బెంపుగబ్బిగుబ్బల కెన యనందగి సొంపు గలిగి వెత లొనర్చుజక్కవపెంటి కూటువలను జక్కవపెంటి కూటువలపాటు గనుంగొని వెఱచి పొలయలుకలు మఱచి పఱచి మగల నిఱియం గౌఁగిలించికొనుముగుదపూఁబోఁడులును ముగుదపూఁబోఁడులనిద్దంపుముద్దుమొగంబులకు దొరగానిసిగ్గునంబోలె ముడుంగఁబాఱిననెత్తమ్ములును నెత్తమ్ములకొలంకులం దలంకక దుంపదూండ్లు మెసవి విసువక కూఁత లిడుకొదమరాయంచబారులునుం గలిగి పుడమియెల్ల మొల్లం బగుచల్లదనంబున నుల్లసిల్లుచుండె నప్పు డాగొల్లరాకన్నియ యెన్నరానివలవంతలఁ బొరలుచుండె నట్టియెడ. ||10||

నీలను మన్మథుఁ డేచుట

క. ఇరువంకలఁ దన్నుఁ బొదవి
గొరవంకలుఁ దుమ్మెదలును గోయిలలుం డ
క్కరిచిలుకలుఁ బురిపులుఁగులు
గొరగొర రా మరుఁడు వెడలెఁ గొమ్మఁ గలంపన్. ||11||

వ. అట్లు వెడలి. ||12||

మ. కడిమిం జిల్కపిసాళిజక్కి నెదురెక్కం జివ్వనం దోలి బ
ల్వెడవింట న్ననువాఁడిపూములుకు లోలిం గూర్చి బిట్టార్చి నె
వ్వడిఁ జేకొల్పిగఁ దీసి డాసి మరుఁ డవ్వాల్గంటిచన్దోయి నె
న్నడుచక్కిన్ గుఱిచేసి యేసెనదరంటం గాఁడి మై సోలఁగన్, ||13||

చ. తలిరుజిరావజీరుబలుదాడికి నోడి కడంక దక్కి య
క్కులుకుమిటారి డెందమునఁ గొందలమందుచు నప్పు డెంతయున్
వలపులవెచ్చ హెచ్చఁ జెలువం బగునమ్మెయిఁగ్రాల సోలుచున్
గళవళపాటుతోఁ జెలిమికత్తెల దూఱుచునుండి వెండియున్. ||14||

సి. తులువరాచిలుకమూఁకలహాళాహళులకుఁ
బాఁపమేపుడుఁబుల్లుబారురొదకు
జమిలిముక్కాలిపిసాళిబల్మ్రోఁతకుఁ
గొదమకోయిలచాలుగొలగొలలకు
గద్దఱిగొరవంకగములుచప్పుడులకుఁ
బొగరుటంచలపల్కువెగటులకును
వలినాలిగాడ్పుబోదలహెచ్చరికలకుఁ
జలివెల్గునుదుటువెన్నెలలసెగకుఁ
తే. దొడరి బడిబడి వెడవింటఁ గుడియెడమల
నడరి వడినేయుకఱివేల్పుఁగొడుకుదుడుకు
టంపజడివానసోనల యలజడికిని
మిగుల నెద నోడి యాడు నమ్మించుఁబోఁడి. ||15||

మన్మథదూషణము

తే. అలరువిలుకాఁడ! బలుసిరి గలిగినట్టి
దొరకొడుకునంచుఁ బొగరునఁ ద్రుళ్ళుకొనుచుఁ
దెఱఁ గెఱుంగక ముగుదలఁ దెరువరులను
బూని యేతువె నీపూన్కి బుగ్గిగాను. ||16||

క. పొరపొచ్చెంబునఁ బలుమఱు
విరిఁబోఁడుల నెల్ల మిగుల వెతవెట్టుదు నీ
దొరతనము ద్రుంగిపోవను
మరుఁడా! నీచేతివిల్లు మంటం గలియన్. ||17||

చ. తలఁపఁగ ముజ్జగంబులకుఁ దల్లియుఁ దండ్రియు నైనలచ్చికిం
బులుఁగుహుమావజీరునకుఁ బుట్టినదిట్టవు నీకు నెల్లరుం
గలయఁగఁ దోడఁబుట్టువులుగారె? యయో! నెవరింతలేకలేఁ
జిలుకలకొల్కులం గలఁపఁ జెల్లున వెల్లుగఁ బచ్చవిల్తుఁడా! ||18||

ఉ. కన్నులవింటివాఁడ! తిగకన్నులదేవరతోడఁ బోరి ము
న్నున్నమునొంది మేఁ దొఱఁగుపట్టున నెక్కడ డాఁగిపోయె నీ
మన్నెఱికంబు నేఁడు కొఱమాలినకోయిలచిల్కమూఁకలం
బన్నుగఁ గూడి చేడియల బాములఁ బెట్టెదు పోటుబంటవై. ||19||

చంద్రదూషణము

చ. బలితపుటామునం దమియుఁ బర్వగఁ గైకొని యొజ్జముద్దియం
గలసిన దోసకారి వని కాదె నినుం గని తమ్మికొమ్మ ని
చ్చలుఁ దలవంచుచుండు? నది చాలదొ యాఱడి నీకు నెంతకుం
జలువలఱేఁడ! నీసవురు సన్నము గా నిఁక నిందు రాకుమీ. ||20||

ఆ. కొంకులేనివెతలఁ గుందెడిముగుదల
డంకతనము మీఱ జంకు లేక
బింకమునఁ గలంచె దింక నెన్నఁడు నీకు
వంక గల్గదోటు జింకతాల్ప? ||21||

తే. కటకటా! మున్ను ముక్కంటికంటిమంట
చేత బూదైన మరునకుఁ జెల్లుఁగాని
తడవు మనియెద ననుకోర్కి నడరు నీకు
జాడయే చేడియల నేఁచఁ జందమామ! ॥22॥

వసంతాదులదూషణము

క. చెలువుగలవాఁడ వంచును
జెలువల నలయింప నీకుఁ జెల్ల దయో నీ
చెలువెల్లఁ జెట్లపాలుగ
నలరుజిరాజోదుతోడ! యామనిఱేఁడా! ॥23॥

క. జత లేనిపూవు గల్గుట
కతివలపైఁ బెల్లు రేఁగి యలజడి మీఱ
న్వెత పెట్టుదువే యిఁక నీ
బ్రతుకు బయ ల్గాను నాలిపయ్యరకుఱ్ఱా! ॥24॥

తే. మున్ను కొన్నాళ్ళు పలుగాకిమూఁకలోనఁ
గలసిమెలఁగినతెఱఁగెల్లఁ గానిపింపఁ
జేడియలమీఁద గ్రుడ్లెఱ్ఱ సేయరాకు
కోయిలా! యింక నీయిల్లు కూలిపోను. ॥25॥

క. నేటుగొని పండ్లు గొఱుకుచుఁ
జీటికిమాటికిని గసరు చిలుకం జిలుకా!
బోటుల నలయించెదు నీ
గోటాపన యెన్నఁ డింక గూఁటం బడునో. ॥26॥

తే. తలిరుఁబోడులడెందము ల్దల్లడిల్లఁ
గూఁక లిడుకొంచు నెంతయుఁ గొఱఁతలేక
యాగడంబునఁ బురివిచ్చి యాడెదేమి
యక్కటా! నెమ్మి! నీయాట యడవిఁగలయ. ॥27॥

క. నెమ్మదిఁ బలుమఱు మొరయుచుఁ
గమ్మనిపూఁదేనె లాని కడుఁ గ్రొవ్వి యహా
గొమ్మలఁ గలఁపగఁ జూచెదు
తుమ్మెద! నీత్రుళ్ళు పెద్దతుప్పలఁ బట్టన్. ॥28॥

తే. తవిలి పలుమఱుఁ జెవులు చీఁదఱఁ గొనంగ
బిట్టు మొరసెదు వసత్రాగినట్టు లిట్టి
గట్టివాజాడ లెట్టుగాఁ బట్టువడియె
బెట్టుగా నిన్ను వెసఁ జెఱఁ బెట్టి యిడను. ॥29॥

వ. అని మఱియు మఱియుఁ బరికించి చెఱకువిలుకానికఱకుచుఱుకుటలరుములికి మొత్తంబులకు నంతకంతకు నగ్గలం బగు వలవంతసెకలఁ గ్రాఁగి వేఁగి సైఁప రాకున్న డిల్లపడి మెల్లన సొమ్మసిల్లిన. ॥30॥

చెలికత్తెలు నీలకు శైత్యోపచారంబులు సేయుట

క. చెలు లెల్లఁ దల్లడిల్లుచు
వలగొని దరి నిలిచి యకట వలవంతసెకల్
బలు వయ్యెఁ దలిరుఁబోఁడికి
వలిపను లిఁక సరగఁ జేయవలె నని మఱియున్. ||31||

ఆ. కప్ర మూఁది మంచిగందంబు మెత్తి ప
న్నీరు చిలికి తూండ్లు నించి వలపు
గ్రమ్ముపూలవిసనకఱ్ఱచే వీచుచుఁ
జివురసెజ్జమీఁదఁ జేర్చి మఱియు. ||32||

తే. ఎన్న రానట్టిచలిపను లెన్ని యేనిఁ
జేయ మే లందులను లేక సేఁగిఁ బొందు
చున్న కన్నియ మెల్లన నుస్సు రనుచుఁ
బొరలి యి ట్లని పలికె నబ్బురము మీఱ. ||33||

సీ. నిద్దంపుఁబాన్పుపై నిప్పులతునియలు
నింపఁ జెల్లునె మీకు నెలఁతలార!
యెడనెడ విసము గ్రక్కెడుపాములనునొడఁ
గూర్పఁ జెల్లునె మీకుఁ గొమ్మలార!
కళపెళనుడుకుచక్కనినూనియల్ మీఁదఁ
జిల్కఁ జెల్లునె మీకుఁ జెలియలార!
మేనఁ బొక్కులు పొక్క మెదియించి సున్నంబు
మెత్తఁ జెల్లునె మీకు మెలఁతలార!
తే. కటకటా! నేఁడు పగ దీఱ నిటులు గలఁప
వలయునే యంచుఁ బలుమఱుఁ గలవరించు
నలరులును దూండ్లుఁ బన్నీరు వలపు గలుగు
చలువసిరిగందమును గాంచి చెలువకంటి. ||34||

ఆ. చానలార! యిపుడు జంటారుమేనులు
దాల్చి మిగుల సెగలఁ దరల నెండ
గాయ సాగె నేమి గాములఱేఁ డని
చెలువ మిగుల నలుకుఁ దలఁకి పలుకు. ||35||

నెలఁతలు మన్మథపూజ సేయుట

ఆ. అట్లు గళవళించు నతివను గనుఁగొని
యనుఁగుఁజెలులు వెఱచి యహహా! వలపుఁ
గాఁక బలిత మయ్యెఁ గ్రాల్గంటి కిఁక మరుఁ
గొలువకున్న మేలు గూడ దనుచు. ||36||

సీ. నునుఁగ్రొత్తసిరిగందమునఁ దిన్నె యొనరించి
చెలువుగొజ్జెఁగనీటఁ గలయ నలికి
పలువన్నె లలరఁ గప్రపుముగ్గులను బెట్టి
పసమించు చెఱకుఁగంబములు నిలిపి
పరువంపుమల్లెక్రొవ్విరులపందిరి ప్రేసి

తళుకుగేదఁగిఱేకు దళ్ళు గట్టి
తొగలఁ జెంగల్వలఁ దోరణంబులు గట్టి
మేలుముత్యాలజాలీల నుంచి
తే. తమ్మిపూమిద్దెగద్దెపైఁ గమ్మవిల్తు
నిమ్ముగా నిల్పి యెమ్మెను గొమ్మలెల్లఁ
గ్రమ్ముకొని పెక్కులాగుల దొమ్మిగూడి
పూజ లొనరించి యి ట్లని పొగడి రపుడు. ||37||

తే. మ్రొక్కెదము నీకుఁ జక్కెర లుక్కెఱలును
మెక్కి నిక్కుచు మిక్కిలి చొక్కుతొగరు
ముక్కు బల్పక్కిజక్కిపై నెక్కి జగము
లుక్కు మెఱయంగ గెలుచుచు నుండుజోద. ||38||

లయ. తుమ్మెదలు నాలివతితెమ్మెరలుఁ గోయిలల
దిమ్ములును జిల్కలును నెమ్మిగములు న్గా
టమ్ముగఁ బోరింబోరిని గ్రమ్ముకొని గొల్వఁ జెలు
వమ్ముగ బయల్వెడలి కమ్మనగువింటం
దమ్మివిరిముల్కి బెడిదమ్ముగ నమర్చి వడిఁ
జిమ్మి కడిమిన్మగల నిమ్ముగను ఔమ్ముల్
గ్రమ్మి కరఁగించుచును గొమ్మలను గూర్చు నిను
నెమ్మదిని గొల్తుము తిరమ్మయినబత్తిన్. ||39||

క. వలరాయఁడ! నీ బెడిదపు
టలరుందూపులకు వెఱతు రఁట నల్వయుఁ గ్రొ
న్నెలతాల్పును నిఁకఁ బెఱవా
రలఁ గలఁచుట యేమి యబ్బురం బరయంగన్? ||40||

క. గోలపయి న్వాలారుం
గోలలఁ బరఁగించి మరులు గొల్పుచు మిగులం
దూలించుట కిఁకఁ దాళం
జాలము నీయాన యో మొసలిడాల్వేల్పా. ||41||

క. అని యనుఁగు లెల్ల నిత్తెఱఁ
గున వెడవిల్కాని వేఁడుకొన నపు డా క్రొ
న్ననఁబోఁడి కొంత డెందం
బున వెత చల్లారఁ దాల్మి పొరయుచు నుండెన్. ||42||

వ. అంత. ||43||

ప్రభాతవర్ణనము

చ. పులుఁగులు గూసె జక్కవలు పొందుగ డాసె బోజుంగుమూఁకకుం
బొలుపులు వాసె రిక్కగమి పోఁడిమి మానెఁ బిసాళితుమ్మెదల్
గొలఁకుల మ్రోసెఁ జీఁకటులు గొబ్బున మాసె హరుండు తుంటవిల్
బలువిడి నెక్కుఁ దీసెఁ దొగపైదలియుం గను మూసె నెంతయున్. ||44||

ఆ. ఇరులగొంగ తమ్మివిరిఁబోఁడివగకాఁడు
చదలుమానికంబు జగముకన్ను
వేఁడివేలు పివము వేఁటాడుపోటరి
ప్రొద్దు తూర్పుమలను బొడమె నపుడు. ॥45॥

తే. తెల్లవాఱుట గన్గొని యెల్లవారు
గొల్లవారింట వేడ్క గన్గొనఁగ వలయు
నంచు మేల్కాంచి తఱిచెయ్వు లన్ని దీర్చి
గీము లలరించుకొనిరి కోర్కియుఁ జెలంగ. ॥46॥

గొల్లదొర తనపట్టుల నలంకరింప నియోగించుట

ఆ. అపుడు గొల్లనాయఁ డందంబుగాఁ దన
నట్టు లలరఁజేయునట్టుగాను
నేర్పు గల్గువారి నేర్పరించినఁ జాల
నెలమితోడ వార లెల్లఁ గడఁగి. ॥47॥

సీ. తెలిముత్తియపుఁబందిరుల నెల్లెడల నిల్పి
నలువొపఁ దొగదోరణములు గట్టి
ముంగిళ్ళఁ గపురంపుమ్రుగ్గు లిమ్ముగఁ బెట్టి
తనరుగోడలను జిత్తరువు దిద్ది
పసిఁడితిన్నియల సొంపెసఁగఁ గస్తురి యల్కి
క్రంతలఁ బన్నీరు గలయఁ జల్లి
పట్టుఁబుట్టముల మేల్కట్టు లమర్చి రీ
విని బయళులను గొల్లెనలు వన్ని
తే. మఱియు దరి లేనిసొగసు లేమఱక చేసి
పలుదెఱంగులవాయిదమ్ములు సెలంగ
నిగురుఁబోఁడులు మగవాండ్రు నీడులేక
యరిది సింగారములు పూని యలరి రంత. ॥48॥

కుంభకునిపురికి గొల్లలు వచ్చుట

సీ. కిఱ్ఱుచెప్పుల గొప్పగీఱునామంబులు
మొలచెక్కుకత్తులు నిలువుసిగలు
కుడిముక్కుగ్రమ్ములు గురివెందపేరులు
పిల్లగ్రోవులు మేటివల్లెతాళ్ళు
లొరుగట్టుపంచలు బెరసుఁబచ్చడములు
గార్కొన్నలోవంక కఱియొడళ్ళు
గుండప్రోగులు చిప్పగొడ్డండ్లు సెలగోల
లొప్పారుపలువంకయుంగరములు
తే. గలిగి గాటంబుగా నెల్లకడలనుండి
పెల్లుమీఱఁగ గిబ్బల పీఁచ మడఁచి
కోర్కు లిగురొత్తఁ గన్నెఁ జేకొనెదమంచు
మొల్లముగఁ జేరి రచటికి గొల్ల లెల్ల. ॥49॥

వ. అట్లు చేరినవారి కెల్ల గొల్లదొర యుల్లంబులు దనియ నోగిరంబులు వేగిరంబునం బెట్టించి వీడెంబులు గందంబులుఁ గోకలుం దొడవులు నిడి విడిదిపట్టుల నునిచె నంతకుమున్న

పనిచినమానిసివలన నత్తెఱింగంతయు విని నందుండు యశోదయుఁ దాటిసిడంబుజోదును బుత్తడిదువ్వలువదాల్పును బయనం బయి గదలి ప్రోల్కడచక్కి న్వచ్చుచుండి రయ్యెడ. ||50||

నందాదులు కృష్ణునితో వచ్చుట

తే. వీటఁ గల్లనినాఁడెంపుబోటు లెల్లఁ
గూటువలు గూడి జన్నంపుగూటిదొరల
మాటకయి మేనుపూనిన మేటివేల్పుఁ
దేటగాఁ జూచుకోర్కి నచ్చోటఁ జేరి. ||51||

సీ. వీఁడెపో యేప్రొద్దు వ్రేపల్లెలో గొల్ల
మగువల వలపించు సొగసుకాఁడు
వీఁడెపో చేలరేఁగి విసపుఁ బా లిడుజాఁగ
రక్కసిఁ దునిమిన యుక్కుఁదునియ
వీఁడెపో నందునివిరిఁబోఁడిముందర
మొనసి చిందులుత్రొక్కుముద్దులాఁడు
వీఁడెపో బండితొల్పేలుపు సుంకించి
పిండిగాఁ దన్నినదండిజోదు
తే. వీఁడెపో వ్రేలగీముల వెన్నజున్ను
గములఁ గొల్లగ మెక్కినగండిదొంగ
యనుచు నుడువుచుఁ దెలిముత్తియంపుసేసఁ
బ్రాలు చల్లిరి వేడుక ల్బయలువడఁగ. ||52||

తే. అపుడు కుంభకుఁ డెదురుగా నరుగుదెంచి
యక్కకును బావకును మ్రొక్కి తక్కువారిఁ
గౌఁగిటను గూర్చి వేడుక ల్గడలుకొనఁగఁ
దనమనికిపట్టునకుఁ దోడుకొనుచు నేఁగి. ||53||

క. అందఱకును బోనమ్ములు
గందమ్ములుఁ దమ్ములములుఁ గడువడి నిడి తా
నందంబుగ డెందంబున
ముం దెన్నఁడు లేనియెలమి మురియుచు నుండెన్. ||54||

కృష్ణునిరాక నెఱిఁగి యాఁబోతులు విజృంభించుట

సీ. ఆరేయి కల్లరియాలపోతులు పైఁడి
వలువదా ల్పచటికి వచ్చు టెఱిఁగి
కినుకతో రెచ్చి దొడ్డిని గల్గుచూడ్పాఁడి
మొదవుల లేఁగలఁ బొదివి చాలఁ
గొమ్ములఁ గ్రుమ్మి లేఁ గొడెల నెడ్లను
దఱుపుల నెత్తురు నెఱయఁ బొడిచి
గోడలు గ్రోడాడి కోవెలల్ నుగ్గాడి
పందిళ్ళు పడఁద్రోచి బండ్లు విఱిచి
తే. తలుపులు పగిల్చి గుడిసెలు దళ్ళుఁ గూల్చి
గొల్లవాడల నెల్ల గగ్గోలు పుట్ట
నాఁడువాండ్రను గుబ్బల నంతమందిఁ

గడఁగి తఱుముచు నెనలేని కడిమిఁ జూపె. ||55||

వ. అంతఁ దెల్లవాఱుటయు నయ్యిలుఱేఁ డెల్లగొల్లకొమరులఁ బిలిపించి తనముద్దుఁబట్టిని దద్దయు సింగారించి తెచ్చి ముందర నునిచి యందఱు విన ని ట్లనియె. ||56||

కోడెలఁ బట్టువానికి నీల నిచ్చెద నని గొల్లలతోఁ గుంభకుఁడు చెప్పుట

ఆ. గొల్లలార! చెడుగుఁగోడెలఁ గంటిరె
జగము లెల్ల మ్రింగఁ జాలుకడిమి
నెసఁగుచున్న వెన్న నివి బొబ్బమెకములో
పులులొ యడవియేనుఁగులొ నిజంబు. ||57||

ఆ. వీనివలనఁ జాల వెతఁ గుందితిమి నేల
ఱేఁడు కినుక చేసి వేఁడి సూపె
నింకఁ బెక్కుమాట లేటికి వినుఁ డిదె
నిక్క మైనదిట్ట లొక్కపలుకు. ||58||

క. బలిమి దలిర్పఁగ నీగి
బ్బలఁ బట్టఁగఁ జాలునేరుపరి కిపు డిత్తుం
జెలువములప్రోక యగునీ
తలిరాకుంబోఁడి నెమ్మి దళుకొత్తంగన్. ||59||

క. అనిన విని గొల్లకొమరులు
ననఁబోఁడులమిన్నఁ గైకొనఁగ వలసినబు
ల్పును గోడెల గెలువఁగ నో
పనిజడుపును గల్గి కాడుపడి యుండి రొగిన్. ||60||

ఘోషవంతుఁడు కోడెలచేఁ జిమ్మఁబడి సొమ్మసిల్లుట

వ. ఆయెడ ఘోషవంతుం డనునొక్కగొల్లకొమరుండు. ||61||

క. గిబ్బల గెల్చుట యిది యొక
యబ్బురమా! యనుచు బింక మాడుచు నపుడే
గొబ్బున లేచి బుజంబులు
దబ్బునఁ జఱచుకొని బల్లిదపుదిట మెసఁగన్. ||62||

తే. తొడరి యమ్మేటియాలపోతులను డాసి
పట్టుకొనఁబోవుటయు నవి బిట్టి గినిసి
కన్నులను నిప్పు లొలుకంగఁ గడఁగి వానిఁ
బొదివె నన్నియుఁ జూపఱు బెదరి పఱవ. ||63||

క. అటువలెఁ బొదివినఁ గనుఁగొని
దిట మింతయు విడక యతఁడు దీటుగఁ గడుముం
దటికిఁ జని యొక్కపోతును
దటుకునఁ బిడికిటను బొడిచెఁ దలనడుచక్కిన్. ||64||

క. పొడిచిన నన్నియు నొక్కు
మ్మడిఁ గడిమి దలిర్ప నతని మార్కొని కినుక
న్నిడుద మొనవాఁడికొమ్ములఁ
బుడమిం బడ వైచి పొడిచి పొరిఁబొరి మట్టెన్. ||65||

ఆ. మట్టి మిగుల నలుగ రెట్టింప దవ్వుగాఁ
జిమ్ముటయును దూలి సొమ్మసిల్లి
పడియె నతఁడు గిబ్బపదు వంత గొల్లల
పైకి నుఱికి కడిమి బలిమిరాయ. ||66||

ఉ. కొందఱఁ బూని కొమ్ములను గ్రుమ్ముచుఁ గొందఱ మ్రగ్గఁద్రొక్కుచుం
గొందఱఁ బెందొడల్ విఱిగి కోయని యార్వఁగఁ గూలఁదన్నుచుం
గొందఱ నేపుతోఁ దఱిమి గుట్టలమెట్టలపా లొనర్చుచుం
జిందఱవంద ఱై పఱవఁ జేయుచు గాటపులావుఁ జూపుచున్. ||67||

కృష్ణుఁడు బలరామునితో నక్కోడెలకతఁ దెల్పుట

క. అప్పగిదిఁ బఱచువారలఁ
దప్పక చూచుచును మోముఁదమ్మిని జిఱున
వ్వొప్పార నపుడు వెన్నుఁడు
కప్పుంబుట్టంబువానిఁ గని యి ట్లనియెన్. ||68||

తే. ఆలపోతులు గా వివి కాలనేమి
కొడుకు లేడ్వురుఁ దనచేత మడిసి తొంటి
సూడుఁ దీర్పఁగఁ బూని యిచ్చోటఁ బుట్టి
రిపుడు వీరి నడంచెద నేపుసూపి. ||69||

క. పగతుర నడఁచుటయున్ బం
దుగులం గాపాడుటయును దొరం బరయం
దిగకంటికైన నిది కడుఁ
దగిలినమే ల్గాదె యిపు డెదం బరికింపన్? ||70||

కృష్ణుఁడు కోడెలఁ బైకొని చంపుట

క. అని పలికి వాని కెదురుగఁ
జనియె నపుడ వేలుపులును జడదారులు నిం
గి నిలిచి కనుఁగొనుచుండం
దన కెంతయు మేలు గోరి తద్దయుఁ బొగడన్. ||71||

క. చని యటఁ బసరపురక్కసు
లను బయికొని దోసకారులారా! కడుఁగ్రొ
వ్వునఁ గలఁచితి రిన్నాళ్ళును
బనివడి జగమెల్ల నింకఁ బఱవక నిలుఁడీ. ||72||

క. కల్లరులై పె ల్లొదవఁగఁ
బొల్లఁగఁ గొల్లలను బాఱఁబొడుచుట గా దిం

కెల్ల తెలుంగుల మిమ్ముం
జెల్లించెద వేల్పుగములు చెలఁగుచు నుండన్. ॥73॥

వ. అని యదలించి పలికిన నులికి యలుక రెట్టింప నద్దబ్బఱగిబ్బరక్కసు లేడ్వురునుం దొంటియొంటమి మేటిపెనంకువం జెంగున నెగసి యుక్కున నొక్కుమ్మడి నతనిం దాఁకిన నబ్బలుమగండు గండుమీఱి లేగున్నయేనుఁగులపయి దాఁటుసింగంబు తెఱంగునం గదిసి యఱచేత మోరలు చఱచియుం దఱిమి యురవడిఁగొమ్ముల మెడల నులిమియుఁ దొడలు విఱిచియు నడుము లవియం బిడికిళ్ళం బొడిచియు వీఁపులు మూఁపురంబులు నడచియు నెత్తురులు జొత్తిల్లం జేసియు మఱియుం బెక్కులాగుల నొప్పించియుఁ జూపఱచూడ్కికి వేడ్కగాఁ గొంతదడవు గడిపి యంత. ॥74॥

క. పిడుగున కెన యనఁ దగుతన
పిడికిట నొక్కొక్కదాని బెడిదంబుగ నె
న్నడినెత్తు లవియఁ బొడిచిన
వడి నొక్కొక్కటియు నేల వ్రాలె గోడెల్. ॥75॥

తే. అట్టు లొక్కొక్క పోటున నాలపోతు
లన్నియును వాత ముక్కునఁ గన్నుఁగవల
నెత్తురులు గార నీలిగి నేలఁ బడిన
నెల్లవారలు వెఱఁగంది రుల్లములను. ॥76॥

దేవాదులు మెచ్చి తత్సూచనల నెఱపుట

సీ. అత్తఱి వేలుపు లాకసంబున నుండి
వెన్నునిపయిఁ జాల విరులవాన
గురియింప నచ్చర ల్గొమరొప్ప నాడిరి
గొల్లఱేండ్లందఱు నుల్లసిలిరి
నందుండు గొమరునిఁ బొందుగాఁ గౌఁగిటఁ
బెనఁచి తద్దయును దీవన లొసంగెఁ
గుంభకుండును దనకోరిక యీడేఱె
నని చూచి సంతసంబునఁ జెలంగె
తే. నీలయును జాల వ్రేతలమేలువాఁడు
తనకు మగఁడయ్యె ననుచు డెందమున నుబ్బె
మఱియుఁ జూపరులెల్ల వేమఱును మెచ్చి
పొగడుచుండిరి వెన్నునిమగతనంబు. ॥77॥

నీలకుఁ గృష్ణునకుఁ బెండ్లి వర్తిల్లుట

ఆ. అంత గొల్లపెద్దలందఱు నీలకు
వెన్నునకును బెండ్లి వెస నొనర్ప
వలయునంచుఁ బూని వలనొప్ప మూరుత
మొజ్జబాఁపనయ్యనొయ్య నడిగి. ॥78॥

ఆ. కాళ్ళగోళ్ళు దీసి కన్నియకును బెండ్లి
కొమరునకును దలలఁ జమురు రాచి
నలుఁగు లిడఁగఁజేసి నలువొప్ప నయిరేని
నీరువోసి రపుడు పేరఁటాండ్రు. ॥79॥

క. తొగసూడు గ్రుంకె దట్టం
బుగఁ జీఁకటు లొదవె రిక్కమొత్తము వొడమెన్
లగనమును డాసె నియ్యెడఁ
దగఁ బెద్దలు నైదువలును దద్దయు నెలమిన్. ||80||

తే. పలుతెఱంగులవాయిదంబులు సెలంగ
రీవితో నల్గడల దివ్వటీ ల్వెలుంగఁ
గన్నియను బెండ్లికొమరునిఁ గడఁగఁ బెండ్లి
తిన్నెమీఁదికి మెల్లనఁ దెచ్చి నిలిపి. ||81||

తే. పుడమివేల్పులు దొలిపల్కునుడువులెలమిఁ
జదువుకొంచును దీవనల్ చాలనొసఁగి
సేసఁబ్రాల్ చల్ల వలిపంపుఁజీర యొకటి
చెలఁగి తెరవట్టి కాల్దొక్కఁజేసిరపుడు. ||82||

ఆ. చాల వేడ్కలొదవఁ గేలుఁదమ్ముల నంటి
యైదువలు కడంగ నంది యిడఁగ
నెన్నరానికూర్మిఁ గన్నియయఱుతను
గట్టుతాల్పు తాలిబొట్టుఁ గట్టె. ||83||

క. వెన్నునితలపైఁ గన్నియ
కన్నియతలమీఁదఁ జుట్టుఁగైదువుజోదున్
సన్నపుముత్తెము లెలమిని
మిన్నక చేదూండ్ల నించి మించిరి మిగులన్. ||84||

క. చీరచెఱంగులు ముడి యిడి
కూరిమిఁ జిటికెనలు వట్టికొనఁ గూరిచి తా
రారంజోతిని గడు నిం
పారఁగ మ్రొక్కించి రప్పు డాలిన్ మగనిన్. ||85||

కృష్ణాదులకుఁ గుంభకుఁడు కట్నంబు లొసంగుట

సీ. అయ్యెడ గొల్లఱేఁ డల్లున కెలమితో
ముత్తెంపుఁజౌకట్లు మురువు లుంగ
రములు నేవడములు రతనంపుఁబావలు
గొలుసులు పదకముల్ జిలుగుఁజేల
లందలా లడపంబు లపరంజిగిండులు
జాలవల్లికలును జందువాలుఁ
బట్టెమంచంబును బఱపును బాలీసుఁ
జందుగుపెట్టెలు మందసములు
తే. గద్దెపీఁటలుఁ గపురంబుఁ గస్తురియును
బాఁడిమొదవులు మేలైన బఱ్ఱియలును
నూడిగీలును వరవుళ్ళు నాఁడె మైన
మంచిగందంపుఁదున్కలు మించ నొసఁగి. ||86||

తే. కూరిమిని వీరకానికి వీరకత్తి
యకును దొలువేల్పుగొంగయన్నకును మఱియుఁ

జుట్టములకెల్ల దొడవులుఁ బుట్టములను
గట్నము లొసంగెఁ గట్టలుగాఁగ నపుడు. ॥87॥

తే. జన్నిగట్లకు బట్లకు నెన్నరాని
పైఁడికట్నంబు లొసఁగి కబ్బంపుఁగూరు
పరులకును గాణలకుఁ బెద్దబాఁపలకును
లెక్కసేయక చీరలు రొక్కమిడియె. ॥88॥

నీలాకృష్ణుల నొక్కటి సేయుట

వ. ఇత్తెఱంగున నెల్లవారలు నలరునట్లుగాఁ బెండ్లి యొనర్చి యంత నొక్క మంచిమూరుతమున
నాల్మగల నొక్కటి సేయఁ దలంచి ప్రోడ లగునైదువరాండ్రఁ బనిగొల్ప వారు నయ్యెడ. ॥89॥

సీ. పగడంపుసకినలపట్టెమంచము దోమ
తెర విరవాదిక్రొవ్విరులపాన్పు
సురమాలిబాలీసునూతినిగవుసెన
జరబాజుచందువాసాన పీఁట
కపురంపుబరణి చిల్కలదివ్వెకంబంబు
నిల్వుటద్దంబు పన్నీటిక్రోవి
జవ్వాదిపక్కణీజాలవల్లిక పైఁడి
వీణె దువ్వెన వట్టివేళ్ళసురఁటి
తే. తమ్మపడిగము మంచిగందంపుఁగోర
పచ్చికస్తురిపెట్టె సంపంగెనూనె
గిండులను గల్గి కన్నులపండుగైన
పచ్చిరాకట్టుగొనబుటుప్పరిగలోన. ॥90॥

ఆ. పెండ్లికొడుకు నిలిపి బిఱబిఱం గన్నెకు
సొగసు దిద్ది వేడ్క లిగురులొత్తఁ
బడకయింటికడకుఁ బరుగునఁ దోడ్కొని
చనుచుఁ బల్కిరపుడు సకియ లెల్ల. ॥91॥

తే. చెలియ! మును నీవు గోరినచెలువుఁ డిప్పు
డించువిల్కానిపని కెప్పుడెప్పుడంచుఁ
దివురుచున్నాఁడు పడకింటఁ దవిలి తమిని
బ్రొద్దు జరుపకు మిఁకఁ జాల ముద్దరాల! ॥92॥

క. అగ్గలపువలపునను మును
బెగ్గడిలుచు నుండి యిపుడు పెనిమిటితోడన్
డగ్గఱఁ బోయినయప్పుడు
సిగ్గేటికిఁ బొడమెనమ్మ చిత్తరుబొమ్మా! ॥93॥

సీ. ముగుద! రమ్మని డాయ మగఁడు చీరినయప్డు
కదియక మార్మలంగెదవు సుమ్ము
వగకాఁడు మొరకొంగు దిగిచి సెజ్జకుఁ దార్ప
నడిగొట్టి వెనుకకుఁ జనెదు సుమ్ము
వెన్నుఁడు కపురంపువిడియం బొసంగిన
నొదిఁగి కైకొనక యుండెదవు సుమ్ము

చెలువుండు పయ్యెదఁ దొలఁగింప గమకింపఁ
గేలు మాడిటి పెనంగెదవు సుమ్ము
తే. సొగసుకాఁ డెదఁ గదియించి జుంటిమోవి
గంటియొనరించి యిక్కువలంటి తుంట
వింటిబలుదంటపనులు గావించినపుడు
కడఁగి మెలఁగంగవలెఁ జుమ్ము కలువకంటి! ॥94॥

క. డేగతెఱంగున బిఱబిఱ
సాగవలదె చెలియ వలపు సడిలేని దహా!
బాగాయెఁ గాఁపురం బిటు
జా గేటికిఁ బొదగదమ్మ చక్కెరబొమ్మా! ॥95॥

సీ. తడవయ్యె బిఱబిఱ నడవరాదె యటన్నఁ
జెలిమీఁదఁ గన్నెఱ్ఱ చేసెదేమి?
నెనరొప్పఁ జెంగట నిలిచి వీడినకొప్పు
దిద్దుకొన్ననఁబోఁడి దిట్టదేమి?
పడఁకతో వెలియాకుమడుపులెమ్మెను జేతి
కొసఁగెడితొయ్యలిఁ గసరెదేమి?
నగుచు గందముదెచ్చి మగని కలందు మ
న్నను బండ్లు గొఱుకుచుఁ గినిసెదేమి?
తే. వాలుగంటిరొ! యిటువంటివారెకారె
చొక్కి పెనిమిటికౌఁగిట దక్కి పెనఁగి
పెక్కుదెఱఁగుల రాచిల్కజక్కిజోదు
పనుల గడిదేఱి ప్రోడలై తనరువారు. ॥96॥

క. ఓకలువకంటి! మును మనుఁ
బైకొని బతిమాలి మగనిపజ్జ కిపుడు దే
రాకుండెదు సిరి వచ్చిన
మోఁకా లడ్డం బిడియెదు మురువు దలిర్పన్. ॥97॥

ఆ. అనుచుఁ బలికి కలికి నర్మిలిఁ దోడ్కొని
పడకయింటి కరిగి పడఁతు లపుడు
ముగుదచేతి విడెము మగనికి మగనిచే
విడెము ముద్దుఁజెలికి నిడఁగఁ జేసి. ॥98॥

క. చెలువుగ నీ కిపు డబ్బె
న్నలువుగ నీతళ్కుఁగుందనపుబొమ్మ యిఁకం
దలఁపునఁ గలిగినతెఱఁగున
మెలఁగుడు వలపులు తలిర్ప మెలఁతయు నీవున్. ॥99॥

ఆ. గోల గాని మిగుల గాళకురాలు గా
దింతి నీకుఁ దక్కె నంత వేగి
రంపుఁబనులవలనిరాయిడి వెట్టక
ముద్దుగుమ్మ నెమ్మి దిద్దుకొమ్ము. ॥100॥

తే. చెప్పవలసినలాగునఁ జెప్పినార
మింతె కా కిపు డెన్న మీ కిరువురకును

గలుగుకూర్ములు గను(గొన్న(దెలిపినట్లు
మెల(గుదురె యంచు మగుచు నమ్మెల(త లరుగ. ॥101102॥

క. వెన్నుఁడు చిఱునవ్వున(దగ(
గన్నియ(జేపట్టి వలపు గ్రమ్మగ సొగసుం
గ్రొన్ననసెజ్జకు(దారిచి
వన్నియ దిద్దుచును మిగుల వలపు దలిర్పన్.

సీ. తెలిముత్తియపుసరుల్ దిద్దునెపంబున
గిబ్బచన్బొగడల(గేల(జెనకి
చెవులకమ్మలు చక్క(జేయుజాడల ముద్దు
చిప్పిల నిద్దంపు(జెక్కులంటి
మొలనూలు సవరించు వలనుగ(గన్పట్టి
వలు(దపిఱుందు(బొక్కిలియు నిమిరి
కపురంపువిడె మొసంగ(గ(బోవులాగున
మొనసి చక్కెరమోవి ముద్దులాడి
తే. పువ్వుటెత్తులు దుఱిమెడి పొలుపెలర్ప(
గప్పు మీఱినబలితంపు(గొప్పు ముట్టి
మెల్లమెల్లనె యొక్కింత మెల(గ డెంద
మించువిలుదాల్పుచెయ్యువ్వల కియ్యకొల్పి. ॥103॥

చ. కులుకుచు(దద్దయున్మదిని గూర్మి తలిర్ప(గ ముద్దుచిల్కుచుం
బలుక వదేమి? యెమ్మెయిని బాగుగ గంద మలందవేమి? కో
ర్కులు వెలయంగ(గౌ(గిటను గూర్ప వదేమి? చలంబొ నానయో
చిలుకలకొల్కి! యి ట్టెరవు సేయ(గ నే నొకలా(తివా(డనే? ॥104॥

ఆ. పిన్ననా(టనుండి పెన(గుచు నాపయిం
గన్నె నీకు వలపు గలదు కదవె
చేరి వే(డుకొనిన(జిక్కులు పెట్టెదు
తాళరాదె యింక(దలిరు(బోడి! ॥105॥

సీ. పరువంపుమారేటిపండు లెచ్చుట(గన్న(
జెలి! నీదుకులుకుగుబ్బలె తలంచి
డంబారునెమ్మిపించెంబు లెచ్చుట(గన్న
ననబో(డి! నీదువేనలియె తల(చి
తిరమొంద(దేనియపెర లెచ్చుటను గన్న(
దెఱవ! నీతొగరువాతెఱయ తల(చి
బెదరి పాఱెడులేటికదుపు లెచ్చుట(గన్న(
గలికి! నీసొగసు(గన్లవయె తల(చి
తే. నిచ్చనిచ్చలు(గానలో(జొచ్చి మిగుల
నెచ్చరికల మెలంగుచు నిచ్చలోన(
గల(గుచుండెదనెనలేని వలపు మీఱ
నింతి యి(క జాగువలదు నన్నేలుకొనుము. ॥106॥

వ. అని నేర్పుం దలిర్పం బలికి. ॥107॥

చ. జిలుఁగుఁబయంట నూడ్చి నునుఁజెన్ను టొయారపుఁజన్నుదోయిపైఁ
గలప మలంది వాల్చెళుకుఁగన్నులు మూసిన నవ్వుకొంచుఁ బొ
క్కిలి వలకేల నంటి గిలిగింతలు గొల్పుచు మోవి యానుచుం
గలికిఁ గరంగఁజేసి బిగికౌఁగిటఁ జేర్చెను వెన్నుఁ డత్తఱిన్. ||108||

తే. మఱియు వెఱగొప్పు చెలువంపుదెఱఁగుపనులఁ
గరఁగఁ జేయుచు నమ్ముద్దుఁగలువకంటిఁ
గలసి యెనలేని నెమ్మదిఁ జెలఁగుచుండి
గుడుసువాల్దాల్పు రేయెల్లఁ గడపి యంత. ||109||

నందాదిపహితుఁ డై కృష్ణుఁడు నీలతోఁ దనపల్లె చేరి సుఖించుట

తే. అత్తమామలయానతి యంది తోడఁ
దల్లిదండ్రులు నన్నయుఁ దవిలి రాఁగఁ
గుందనపుటందలములోనఁ గొమ్మ నిలిపి
యుల్లమునఁ బొంగుచును దనపల్లె కరిగె. ||110||

క. అరిగి తననగరిలోనికి
సరగునఁ జొత్తెంచి యపుడు సంగడికాండ్రుం
బెరిమె గలపెద్దలను గని
యిరవుగ మన్నించి చాల నెమ్మెదలిర్పన్. ||111||

ఆ. అంత నీలఁ గూడి యింతంత యనరాని
సంతసంబు మీఱ జగము లెల్లఁ
బ్రోచుకొనుచు నెపుడుఁ బులుఁగుడాల్వేలుపు
తలఁకులేని సిరులఁ దనరుచుండె. ||112||

వ. అని నిరాబారిసింగంబులకెల్లఁ దత యెఱింగించిన వారలు కొలందిలేనివేడుకలం దనరు
చుండిరి. ||113||

ఉ. రిక్కలు మంచు నద్దమును రేదొరయుం గపురంబుఁ బాలునుం
జక్కెరరాచపు ల్చిలువసామియుఁ జిందముఁ దూఁడు మేపుడుం
బక్కిగముల్ జగా నలువపట్టియు బొబ్బమెకంబువేల్పురా
జక్కియు నీడువోలినయసంబునఁ బాటిలు మేటిదయ్యమా! ||114||

క. పుత్తడిమలవిలుకాఁడా!
గిత్తహుమా నెక్కి హొయలఁ గేరెడు ఱేఁడా!
మత్తిల్లుమిత్తిసూడా!
బత్తిమిగులఁ గలుగువారి పాలిటివాఁడా! ||115||

తరళము. చిలువపేరులు ఱొమ్మునం దలఁ
జిన్నిక్రొన్నెలపువ్వునున్
మొలను బెబ్బులితోలుఁ గేలను
ముద్దుగుల్కెడి జింకయున్
నలువయౌదలపుర్కపళ్ళెము
నల్లగుత్తుకయు న్మెయి

న్వలపునున్వెలిబూదిపూఁతయు
వావిరిం గలవేలుపా! ॥116॥

గద్యము. ఇది శ్రీమదుమారమణ కరుణాకటాక్షనిరీక్షణ సంలబ్ధసరసకవితాసామ్రాజ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచి గంగానామాత్యపుత్త్ర బుధజనవిధేయ తిమ్మయనామధేయప్రణీతం బైననీలాసుందరీపరిణయంబను నచ్చతెనుఁగుఁగబ్బంబునందు సర్వంబును దృతీయాశ్వాసము.

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము. —1939.